Follow: @ANNTELUGU

ANN తెలుగు

05-10-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 254 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అమ్మ పాటను విడుదల చేసిన ఎఎన్ఎన్, మహాపత్రికల సీఈవో కంది రామచంద్రారెడ్డి

**రచయిత వెంగళభాస్కర్, దర్శకుడు బొలేకు అభినందనలు**

**హైదరాబాద్, మహా :** ప్రముఖ పాటల రచయిత వెంగళభాస్కర్ రచించిన ఎవరే అమ్మ పాటను హైదరాబాద్ లోని అమ్మన్యూస్ నెట్ వర్క్ కేంద్ర కార్యాలయంలో ఎఎన్ఎన్, మహాపత్రికల సీఈవో కంది రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఎవరే అమ్మ పాటకు మిగతా 3వ పేజీలో



టాప్ న్యూస్



### సింగీతం ఇక జ్ఞాపకం చిత్రపరిశ్రమలో విషాదం

- ప్రయోగాత్మక చిత్రాలకు కేరాఫ్

03



### జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ

- కేరళ సర్కార్ సంచలన నిర్ణయం
- ఆత్మహత్యకేసులో దర్యాప్తు

03



### కుప్పంకు నీళ్ళు.. పాలమూరుకు కన్నీళ్ళా?

- టీఆర్ఎస్ చీఫ్ కవిత హాట్ కామెంట్స్
- కరువు మండలాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్

03

# తెలంగాణలో త్వరలో బీసీ ముఖ్యమంత్రి



## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ప్రకటన

- కులాలను పక్కనపెట్టి బీసీలు ఏకం కావాలి
- మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం సీట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది
- రాష్ట్ర బీజేపీ నాయకులు దద్దమ్మలు
- మోదీ దిగే టైమొచ్చింది.. రాహుల్ ప్రధాని కావడం తథ్యం

**శంషాబాద్, మహా :** బీసీల హక్కుల సాధన కోసం మాట్లాడే ధైర్యాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కల్పించారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శంషాబాద్ వేదికగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో త్వరలో బీసీ వర్గానికి చెందిన నాయకుడే ముఖ్యమంత్రి కాబోతున్నారని ఘంటాపథంగా ప్రకటించారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అందించిన ధైర్యంతోనే ఈ చారిత్రక మార్పు సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు.

**రాహుల్ గాంధీ బాటలోనే కాంగ్రెస్ అడుగులు**

రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' స్ఫూర్తితోనే "ఎవరికి ఎంత వాటా దక్కాలో, అంత దక్కాలనే" నినాదంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీలకు రావాల్సిన వాటాను రాజ్యాగబద్ధంగా సాధించుకుంటామని, అవసరమైతే హక్కులను లాక్కుంటామని హెచ్చరించారు. బీసీల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల సహకారంతో రాష్ట్రంలో కుల సర్వే నిర్వహించి పక్కా డాక్యుమెంట్‌ను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై మహేష్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలు మోదీ, అమిత్ షాల వద్దకు వెళ్ళి బీసీల హక్కుల గురించి మాట్లాడే దమ్ము, ధైర్యం రాష్ట్రంలోని బీజేపీ నాయకులకు లేదని, వారంతా దద్దమ్మలని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన కేంద్ర సర్వేలో ఓబీసీ కాలమ్‌ను తొలగించి మోదీ ప్రభుత్వం బీసీలకు తీవ్రమైన వంచన చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో చేపట్టిన కుల సర్వే యావత్ దేశానికి రోల్ మిగతా 3వ పేజీలో

### పెమ్మసాని పొలిటికల్ హీరో

- గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై
- సీఎం చంద్రబాబు ప్రశంసలు

03












# బిల్డర్ల బరితెగింపు..!

**అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం – 3..!**

## అయ్యప్ప సొసైటీలో అవినీతి అనకొండలు..!

- బ్యూరోక్రాట్ల అడ్డాగా మారిన అయ్యప్ప సొసైటీ..!
- జీరో పర్మిషన్లతో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు..!
- హోటళ్లు, కాలేజీలు, కో-లివింగ్ హాస్టళ్లు, వ్యాపార సముదాయాల కోసం నిబంధనలను బొందపెట్టి బహుళ అంతస్తుల నిర్మాణాలు..!
- సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ మచ్చుకైనా కనిపించని వైనం..!
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా నిర్మాణాలు..!
- అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులేనా..?
- ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అటువైపు కన్నెత్తి చూడాలంటే వణుకు..!
- అక్రమ నిర్మాణాలను ఉపేక్షించమంటూ సీఎంసీ కమిషనర్ కళ్లబొల్లి కబుర్లు..!
- ప్రెస్‌మీట్‌లతోనే కాలం వెళ్లదీస్తున్న సీఎంసీ కమిషనర్..!
- క్షేత్రస్థాయి ఆచరణలో అంతా డొల్లే..!
- అయ్యప్ప సొసైటీకి వెళ్లేందుకే సాహసించని సీఎంసీ, హైడ్రా కమిషనర్లు..!

02

## సీఎంసీ సాక్షిగా అంతులేని అక్రమ నిర్మాణాలు..!

రాజధాని నడిబొడ్డున ఐటీ కారిడార్‌లో నియమ నిబంధనలను బొందపెట్టి బిల్డర్లు బరితెగించడంతో అయ్యప్ప సొసైటీ 'ఆటవిక రాజ్యం'గా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అటువైపు కన్నెత్తి చూడాలంటేనే వణికిపోయేలా బ్యూరోక్రాట్ల అడ్డాగా మారిన ఈ ప్రాంతంలో, అవినీతి అనకొండలు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయి.. సీఎంసీ సాక్షిగా, టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే జీరో పర్మిషన్లు, నోటరీలతో అంతులేని అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.. హోటళ్లు, కాలేజీలు, కోలివింగ్ హాస్టళ్లు, భారీ వ్యాపార సముదాయాల కోసం నిబంధనలను తుంగలో తొక్కి బహుళ అంతస్తుల నిర్మాణాలు ఆకాశాన్నంటేలా వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు..కనీస సెట్ బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు మచ్చుకైనా కనిపించని ఈ అక్రమ సామ్రాజ్యంలో ఏ క్షణంలోనైనా అగ్ని ప్రమాదాలు జరిగితే అమాయకుల ప్రాణాలు గాల్లో కలవడం ఖాయం.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదంటూ సీఎంసీ కమిషనర్ ప్రెస్‌మీట్‌లతో కళ్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయి ఆచరణలో అంతా డొల్లేనని తేలిపోయింది. కనీసం అయ్యప్ప సొసైటీకి వెళ్లి పరిశీలించేందుకే సీఎంసీ, హైడ్రా కమిషనర్లు సాహసించకపోవడం వెనుక ఉన్న అసలు మర్మమేంటో బహిర్గతం చేస్తూ... ప్రజా రక్షణను గాలికి వదిలేసిన ఈ అవినీతి సామ్రాజ్యంపై 'మహా' అందిస్తున్న ప్రత్యేక కథనం...

### పేరుకే సిఎంసీ, హైడ్రా అంతా బోగస్..

సిఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్, ఏసీపీ, టీపీవో వంటి అధికారులతో పాటు హైడ్రా అధికారులు ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ.. బ్యూరోక్రాట్లు ధనిక వర్గాలకు కొమ్ముకాస్తూ, వారి ఆస్తులు కాపాడటానికే ఉన్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవంగా వంద గజాల స్థలంలో స్టిల్ట్ +2 అనుమతులు తీసుకుని, ఒక పెంట్‌హౌస్ వేసుకున్నా సిఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు హైడ్రా అధికారులు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించి అదనపు ఫ్లోర్, పెంట్‌హౌస్‌ను కూల్చివేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. కానీ అయ్యప్ప సొసైటీలో 200 గజాల్లో జీరో పర్మిషన్, నోటరీలతో గ్రౌండ్+7 నుంచి 8 అంతస్తుల వరకు నిర్మాణాలు జరుగుతుంటే.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సిఎంసీ పరిధిలోని ఆయా ప్రాంతాల ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.సిఎంసీ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సిఎంసీ , హైడ్రా కమిషనర్ స్పందించాల్సిన అవసరం ఉందని, దీనిపై బహిరంగ చర్చ పెట్టాలని పురప్రముఖులు, మేధావులు సైతం ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొంటారా? ఉన్నత వర్గాలకే కొమ్ముకాస్తారా? అన్నదానిపై స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.



సీ ఎం సీ కమిషనర్ డాక్టర్ జి. సృజన



హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్

## పేదల గృహనిర్మాణంలో సరికొత్త శకం



- దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 3డీ కాంక్రీట్.
- ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్.

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసింది. గృహ నిర్మాణ రంగంలో ఒక సరికొత్త విప్లవానికి తెరతీస్తూ, దేశంలోనే తొలిసారిగా గ్రామీణ గృహనిర్మాణంలో అత్యాధునిక 'త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్' సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గ పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లు సంయుక్తంగా ఈ వినూత్న పైలట్ ప్రాజెక్టును మిగతా3వ పేజీలో




## ఆదిలాబాద్ కాంగ్రెస్ లోకి వలసల జోరు



బీజేపీ బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

07

## అక్రమ నిర్మాణాలపై చర్యలెప్పుడు..?

- ఘట్‌కేసర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు..!
- ఫిర్యాదులు, కథనాలు వస్తున్నా ఆగని నిర్మాణ పనులు..!
- తూతూమంత్రంగా కూల్చివేతలు.. మళ్లీ యథావిధిగా పనులు..!
- జోడిమెట్ల, అన్నోజిగూడలో నిబంధనలకు తూట్లు..!
- చెరువులు, పార్కు స్థలాల పరిరక్షణపై అధికారుల నిర్లక్ష్యం..!
- ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగాల్సిందే..!

03






# బిల్డర్ల బరితెగింపు..!

**హైదరాబాద్, మహా:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కూకట్‌పల్లి జోనల్, మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ.. హైటెక్ సిటీ, సీఎంసీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని చూస్తే.. ఇది నివాస ప్రాంతమా.. లేక రియల్ మాఫియా అండర్‌వరల్డ్ సామ్రాజ్యమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడవిలో చెట్లు పెరిగినట్టు.. చీమలు దూరని చిట్టడవిలా, కాకులు దూరని కారడవిలా ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక భవనం మీద మరో భవనం.. ఒక అంతస్తుపై మరో అంతస్తు.. భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకుండానే నోటరీ స్థలాలను సైతం వదలకుండా నిర్మాణాలు సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫైర్ సేఫ్టీ నిబంధనలు మచ్చుకైనా కనిపించకపోగా.. సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, ఆక్యుపెన్సీ, భవన వినియోగ అనుమతులు తదితర తప్పనిసరి నిబంధనలను సైతం బేఖాతరు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న విస్తీర్ణంలోనే భారీ బహుళ అంతస్థులు నిర్మిస్తూ వాటిని కో-లివింగ్ హాస్టళ్లు, హోటళ్లు, పబ్‌లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలుగా వినియోగిస్తున్నారని, ఇంతటి స్థాయిలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతి అనకొండల అడ్డా..**
**బ్యూరోక్రాట్లకు వెన్నుదన్ను!**

అయ్యప్ప సొసైటీ ఇప్పుడు సామాన్య ప్రజల నివాస ప్రాంతం కాదు.. బ్యూరోక్రాట్లు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి వెనుక ఉన్న రియల్ మాఫియా అనకొండలకు రక్షిత ప్రాంతంగా మారింది. కోట్ల రూపాయల విలువ గల స్థలాల్లో చట్టబద్ధతను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా ఆక్రమణలు, నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్కడ ఏం జరుగుతుందో తెలిసినా, బ్యూరోక్రాట్ల ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో జోగుతూ కళ్లుండీ చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

జీరో పర్మిషన్లు.. సెట్‌బ్యాక్, ఫైర్ సేఫ్టీ నిల్!

అయ్యప్ప సొసైటీ పరిధిలో హోటళ్లు, కాలేజీలు, కోలివింగ్ హాస్టళ్లు, భారీ వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. అయితే వీటిలో దాదాపు 80 శాతానికి పైగా భవనాలు 'జీరో పర్మిషన్' (ఎలాంటి అనుమతులు లేకుండా) తో నిర్మించినవే కావడం గమనార్హం. 100 నుంచి 150 గజాల చిన్న స్థలాల్లో సైతం 6 నుండి 7 అంతస్తుల ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నారు. కానీ అలాంటి భవనాలు కుప్పకూలి ప్రాణహాని జరిగితే గానీ స్పందించని ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద స్పందిస్తారే తప్ప ఇలాంటి నిర్మాణాలవల్ల భవిష్యత్తులో జరగబోయే అనర్థాలను అంచనా వేయడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

**అంగుళం ఖాళీ లేని నిర్మాణాలు (జీరో సెట్‌బ్యాక్స్):**

భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ప్రతీ భవనం చుట్టూ గాలి, వెలుతురు, అత్యవసర మార్గం కోసం నిర్ణీత విస్తీర్ణంలో ఖాళీ స్థలాన్ని (సెట్ బ్యాక్) వదలాలి. కానీ అయ్యప్ప సొసైటీలో ఈ నిబంధనలను పూర్తిగా పాతిపెట్టారని, భవనానికి, భవనానికి మధ్య అంగుళం కూడా ఖాళీ లేకుండా పక్కపక్కనే గోడలు కట్టేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక భవనం కిటికీ తెరిస్తే పక్క భవనం గోడ తాకేలా, అసలు వెంటిలేషన్ అనేదే లేకుండా దిగ్బంధనంలా నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అగ్నిమాపక యంత్రాలు కూడా వెళ్లలేని సందులు (ఫైర్ సేఫ్టీ శూన్యం)**

ఈ బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర అగ్నిమాపక వసతులు (ఫైర్ సేఫ్టీ ) మచ్చుకైనా కనిపించవు. ఇరుకైన సందుల్లో, వందల గజాల్లోనే 6, 7 అంతస్తులు లేపడంతో అగ్నిప్రమాదం సంభవిస్తే లోపలికి అగ్నిమాపక యంత్రాలు (ఫైర్ ఇంజిన్లు) వెళ్లడానికి కూడా దారి లేనంత ఘోరమైన పరిస్థితి నెలకొంది. ఎమర్జెన్సీ ఎగ్జిట్ (అత్యవసర నిష్క్రమణ మార్గాలు) కానీ, స్పైరల్ మెట్లు కానీ లేకుండా కేవలం ఒకే ఇరుకైన మెట్ల దారితో భవనాలను నిర్మిస్తున్నారు.

చుట్టుపక్కల అనేక విద్యాసంస్థలు, చైతన్య, రెజొనెన్స్, బాష్యం, ఐఐటీ , మెడికల్ తదితర విద్యాసంస్థలకు చెందిన హాస్టళ్ల నిర్వహణ కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవేళ ఆకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగితే మున్సిపల్, హైడ్రా అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి ప్రమాదం జరిగితే ఎదుర్కొనేందుకు సిఎంసీ , హైడ్రా అధికారులు సిద్ధంగా ఉన్నారా? అని సిఎంసీ లోని కొందరు పురప్రముఖులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ప్రాణాలు గాల్లో కలిశాక స్పందిస్తారా?

ఇలాంటి భవనాల్లో వేలాది మంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు కోలివింగ్ హాస్టళ్లలో నివాసముంటున్నారు. రేపటి రోజున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే, బయటకు పరుగులు తీసేందుకు కూడా మార్గం లేక వందలాది మంది ప్రాణాలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం ఉంది. ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిశాక అధికారులు విచారణ కమిటీలు వేస్తారా? లేక ముందే మేల్కొని చర్యలు తీసుకుంటారా? అపార ప్రాణనష్టం సంభవిస్తే దానికి టౌన్ ప్లానింగ్ అధికారులా లేక అనుమతులు లేకుండా కట్టిన బిల్డర్లా... ఎవరు బాధ్యత వహిస్తారు? అని స్థానికులు అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నారు.







**రోజుకు రెండు కూల్చివేతలతో.. వేలాది అక్రమ నిర్మాణాల సంగతేంటి..?**

సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన ప్రెస్‌మీట్‌లలో అక్రమ నిర్మాణాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ.. సీఎంసీ పరిధిలో 372 అక్రమ నిర్మాణాలను గుర్తించామని, రోజుకు రెండు అక్రమ నిర్మాణాల చొప్పున కూల్చివేతలు చేపడుతున్నామని ప్రకటించిన నేపథ్యంలో అయ్యప్ప సొసైటీ పరిస్థితిపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఒక్క అయ్యప్ప సొసైటీలోనే వేల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తుండగా.. వాటిని కేవలం వందల్లోనే గుర్తించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. రోజుకు రెండు అక్రమ నిర్మాణాల చొప్పున కూల్చివేస్తే.. ఇప్పటికే వేల సంఖ్యలో ఉన్నాయని ఆరోపిస్తున్న అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. “రోజుకు రెండు నిర్మాణాలే కూల్చివేస్తే.. వేలాది నిర్మాణాల వంతు ఎప్పుడొస్తుంది..? అప్పటికి పరిస్థితి ఎలా ఉంటుంది..?” జీవితకాలం సరిపోతుందా..? అంటూ స్థానికులు బహిరంగంగానే సవాల్ చేస్తున్నారు.

**అయ్యప్ప సొసైటీ విషయంలో హైడ్రా సైతం తేలిపోయిందా..?**

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటిస్తున్న హైడ్రా.. అయ్యప్ప సొసైటీ విషయంలో మాత్రం తేలిపోయిందా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భారీ బహుళ అంతస్తుల భవనాలు, కో-లివింగ్ హాస్టళ్లు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నా.. హైడ్రా ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే హైడ్రా.. అయ్యప్ప సొసైటీ వైపు మాత్రం ఎందుకు దృష్టి సారించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. సీఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారులు.. అయ్యప్ప సొసైటీలో మాత్రం ఇంత భారీగా నిర్మాణాలు సాగుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారు..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

హైడ్రాలో ఉన్న కొంతమంది ఉన్నతాధికారులకు అయ్యప్ప సొసైటీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఉండడం తోనే అటువైపు కన్నెత్తి చూడటం లేదనే వాదన మరోవైపు వినిపిస్తోంది.

అయ్యప్ప సొసైటీలో 'జాయింట్ ఆపరేషన్' ఎక్కడ..? గతంలో గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలిపోయి అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోయినప్పుడు అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హడావుడిగా క్షేత్రస్థాయికి పరుగులు తీసి, వివిధ శాఖల సమన్వయంతో తనిఖీలు చేపట్టింది. ప్రమాదాలు జరిగాక మేల్కొనడం కాదు.. ముందే అక్రమాలను గుర్తించి అడ్డుకోవాలని ఆ సమయంలో స్థానికుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తాయి.

అయితే, అదే తరహా సమన్వయ చర్యలు ఇప్పుడు అయ్యప్ప సొసైటీలో ఎందుకు కనిపించడం లేదు? సిఎంసి - హైడ్రా సంయుక్త ఆపరేషన్ ఏమైంది? అంటూ స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**చేతులు కాలాక ఆకులు పట్టుకుంటారా?**

అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న భారీ బహుళ అంతస్తులు, కోలివింగ్ హాస్టళ్లు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలపై తక్షణమే సమగ్ర తనిఖీలు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవనాల అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని, కమిటీలు, సమావేశాలు, ప్రెస్‌మీట్లతో కాలయాపన చేయకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టకపోతే.. రేపటి రోజున ఏదైనా అగ్నిప్రమాదమో, దుర్ఘటనో జరిగితే భారీ ప్రాణనష్టం సంభవించడం ఖాయమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




**అక్రమాలకు అండగా అవినీతి తిమింగలాలు..**

నిబంధనలను బొందపెట్టి నిర్మాణాలు సాగుతున్నా అధికారుల దృష్టికి రాకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మాదాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు అక్రమ నిర్మాణాలను కాపాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్షేత్రస్థాయి పర్యవేక్షణలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఏసీబీ నిఘా పెట్టాలని, వారి ఆదాయానికి మించిన ఆస్తులపై విజిలెన్స్ విచారణ జరిపితే అసలు గుట్టు రట్టవుతుందని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న బిల్డర్లపైనే కాకుండా, వారికి అభయహస్తమిస్తున్న అధికారులపైనా కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఇప్పటికైనా మేల్కొంటారా..?**

ఇప్పటికైనా సీఎంసీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి.. అయ్యప్ప సొసైటీలో నిబంధనలకు తూట్లు పొడుస్తూ వెలుస్తున్న అంతులేని అక్రమ నిర్మాణాలను సమగ్రంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం కమిటీలు, సమావేశాలు, ప్రకటనలకే పరిమితం కాకుండా.. హైడ్రా-సీఎంసీ సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని.. అవసరమైన చోట అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తేనే బిల్డర్లలో భయం పుట్టి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టజెప్పాలంటూ భారీ మొత్తంలో బిల్డర్ల నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్కో బిల్డర్ నుంచి రూ.25 నుంచి రూ. 30 లక్షల వరకు వసూలు చేస్తున్నారని బిల్డర్లు ఆరోపిస్తున్నారు. ఈ ముడుపులు సీఎంసీ కమిషనర్ వరకు చేరుతున్నాయా.. లేక కమిషనర్ పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.































# అక్రమ నిర్మాణాలపై చర్యలెప్పుడు..?

**మహా, ఘట్‌కేసర్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై వరుసగా ఫిర్యాదులు, మీడియా కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో చలనం కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జోడిమెట్లలో జీరో పర్మిషన్‌తో భారీ షెడ్ల నిర్మాణాలు, అన్నోజిగూడలో చెరువు పరిసరాల్లో భవన నిర్మాణం, పార్కు స్థలంలో జీ+2 నిర్మాణం వంటి అంశాలు ఇప్పటికే అధికారుల దృష్టికి వెళ్లినా.. నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తూతూమంత్రం కూల్చివేతలతో సరిపెడుతున్నారా..?**

జోడిమెట్లలో తాజా కిచెన్ సమీపంలో నిర్మితమవుతున్న భారీ షెడ్డు వ్యవహారంలో అధికారులు గతంలో కేవలం కొంతమేర కూల్చివేతలు చేపట్టి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనంతరం కొద్దిరోజులు పనులు నిలిచిపోయి, మళ్లీ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని వారు పేర్కొంటున్నారు.

అక్రమ నిర్మాణం పూర్తిగా తొలగించకుండా, సీజ్ చేయకుండా వదిలేయడం వల్లే నిర్మాణదారులు తిరిగి పనులు ప్రారంభించే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు మండి పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డును సీజ్ చేసి, తదుపరి పనులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**పాత నిర్మాణంపై చర్యలు.. కొత్తదానిపై ఎందుకు మౌనం?**

ఇదే ప్రాంతంలో గతంలో తాజా కిచెన్ సమీపంలోని మరో భారీ షెడ్డు విషయంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ చర్యలు చేపట్టిన విషయాన్ని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో వరుస కథనాలు, ఫిర్యాదుల నేపథ్యంలో నిర్మాణాన్ని కూల్చివేసి సీజ్ చేసిన అధికారులు.. ప్రస్తుతం అదే ప్రాంతంలో మరో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నా ఎందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.



**తాజా కిచెన్ ఎదురుగా తూతూ మంత్రంగా కూల్చిన షెడ్డు..తిరిగి యదేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణ పనులు**

ఒకే ప్రాంతంలో ఒక నిర్మాణంపై కఠిన చర్యలు.. మరో నిర్మాణంపై తూతూమంత్రం ఎందుకు? అనే ప్రశ్నకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు.

**అశోక్ లేలాండ్ ఎదురుగా మరో భారీ షెడ్డు**

జోడిమెట్లలోని అశోక్ లేలాండ్ షోరూమ్ ఎదురుగా ప్రధాన రహదారిని ఆనుకుని మరో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించిన భవన అనుమతులు, భూవినియోగం, ఇతర శాఖల అనుమతులను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపివేసి, నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నట్లయితే వాటి వివరాలను ప్రజలకు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.

మీరాలం కుంటలో నిర్మాణంపై విచారణ ఏది..?

అన్నోజిగూడలోని మీరాలం కుంట పరిసరాల్లో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా జీ+2 నిర్మాణం కొనసాగుతోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో పత్రికల్లో కథనాలు వెలువడిన అనంతరం కొంతకాలం పనులు నిలిచిపోయి.. తిరిగి నిర్మాణం వేగం పుంజుకుందని స్థానికులు పేర్కొంటున్నారు.

చెరువు పరిధికి సంబంధించి అధికారిక రికార్డులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను అధికారులు క్షేత్రస్థాయిలో నిర్ధారించి.. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తక్షణమే నిలిపివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**పార్కు స్థలంలో జీ+2 ఎలా..?**



**అశోక్ లేలాండ్ షోరూం ఎదురుగా నిర్మితమవుతున్న భారీ షెడ్డు**

అన్నోజిగూడ సత్యసాయి హౌసింగ్ కాలనీలోని సర్వే నంబర్లు 18, 19, 44 పరిధిలో పార్కు స్థలంగా పేర్కొంటున్న ప్రాంతంలో జీ+2 నిర్మాణం కొనసాగుతున్న అంశంపైనా సమగ్ర విచారణ జరగాల్సి ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

గతంలో నిర్మాణ పనులను అధికారులు నిలిపివేసినట్లు పేర్కొంటున్న నేపథ్యంలో.. ప్రస్తుతం నిర్మాణం ఏ ప్రాతిపదికన కొనసాగుతోంది? అనుమతులు ఉంటే ఎప్పుడు మంజూరయ్యాయి? స్థలం పార్కు/ఓపెన్ స్పేస్‌గా ఉంటే నిర్మాణానికి ఎలా అవకాశం కల్పించారు? అనే అంశాలను అధికారులు తేల్చాల్సి ఉంది.

**పన్నులు, అనుమతులపైనా ఆడిట్ చేయాలి..**

జీరో పర్మిషన్‌తో నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే కేవలం నిర్మాణాన్ని నిలిపివేయడం మాత్రమే కాకుండా.. ఇప్పటివరకు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూవినియోగం, ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ తదితర అంశాలను కూడా అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం జరిగిందా అనే అంశంపైనా సంబంధిత శాఖలు విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నివేదికలపై కాదు.. క్షేత్రస్థాయిలోనే విచారణ చేయాలి...**

ఘట్‌కేసర్ సర్కిల్‌లోని అక్రమ నిర్మాణాలపై స్థానిక సర్కిల్ అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా ఉప్పల్ జోనల్ కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. జోడిమెట్లలోని రెండు భారీ షెడ్లు, మీరాలం కుంట నిర్మాణం, సత్యసాయి హౌసింగ్ కాలనీలోని పార్కు స్థల నిర్మాణంపై ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణదారులకు అడ్డుకట్ట వేసేదెప్పుడు..?**

ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు హడావుడిగా తనిఖీలు నిర్వహించి, అనంతరం నిర్మాణాలు మళ్లీ కొనసాగుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలు నిజమని తేలితే పూర్తిస్థాయి సీజ్, అవసరమైన కూల్చివేతలు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇకనైనా ఈ వ్యవహారంపై నేరుగా దృష్టి సారించాలి. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా.. ఒక్కొక్కటిగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





ఘట్‌కేసర్ సర్కిల్‌లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!

జోడిమెట్లలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ షెడ్లు...!

హోటళ్లు, వాణిజ్య సముదాయాల కోసం 'జీరో' పర్మిషన్లతో జోరుగా నిర్మాణాలు...!

పార్కు స్థలాలు, చెరువులను సైతం వదలని అక్రమార్కులు...!


మహా

ఘట్‌కేసర్ సర్కిల్‌లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!

కూల్చివేత...!

కూల్చివేత...!

ఆగని అక్రమ నిర్మాణాలు...!

# అమ్మ పాటను విడుదల చేసిన ఎఎన్ఎన్, మహాపత్రికల సీఈవో కంది రామచంద్రారెడ్డి

( మొదటి పేజీ తరువాయి )

సంగీతం అందించిన శ్రీవెంకట్ తో పాటు ప్రముఖ సంగీతదర్శకుడు, గాయకుడు బోలేషావలి, రచయిత వెంగళభాస్కర్, నిర్మాత శ్రీనివాస్, న్యూస్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి నటీనటులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో అనేక హిట్ సాంగ్స్ అందించిన బోలేషావలి ఈ వీడియోసాంగ్ కు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా రచయిత భాస్కర్, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలిపారు. ప్రముఖులు పాటలోని సాహిత్యం, చిత్రీకరణ అద్భుతంగా ఉందని వెంగళభాస్కర్ ను, బోలేను ప్రశంసించారు. ఈ పాట అత్యధిక ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు.

# సింగీతం ఇక జ్ఞాపకం చిత్రపరిశ్రమలో విషాదం

**ప్రయోగాత్మక చిత్రాలకు కేరాఫ్**

**చెన్నై, మహా :** అజరామర చిత్రాల సృష్టికర్త, దిగ్గజ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు ఇక లేరు. భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాలకు పెద్దపీట వేసి, సంప్రదాయ మేకింగ్ పద్ధతులకు భిన్నంగా దర్శకత్వానికి సరికొత్త బాటలు చూపిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతితో తెలుగు, తమిళ, కన్నడ సహా యావత్ భారత చిత్రసీమ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం అంటే తన 94వ ఏట కూడా కెమెరా ముందుకు వచ్చి 'సింగ్ గీతం' పేరుతో చిత్రాన్ని తెరకెక్కించారు. తద్వారా సినిమాపై తనకున్న అంతులేని తపనను చాటుకున్నారు. ఆయన సతీమణి లక్ష్మీ కల్యాణి ఆయన సినిమాలకు స్క్రిప్ట్ వర్క్‌లో సహాయం చేస్తూ, వ్యక్తిగత జీవితంలోనూ వెన్నంటి నిలిచారు. ఆమె 2022లో చెన్నైలో కన్నుమూశారు. భార్య జ్ఞాపకార్థం సింగీతం శ్రీనివాసరావు 'శ్రీకళాణీయం' అనే పుస్తకాన్ని కూడా రచించారు.

**సింగీతం నేపథ్యం**

సింగీతం శ్రీనివాసరావు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఉదయగిరి. ఆయన 1931 సెప్టెంబరు 21న జన్మించారు. తండ్రి రామచంద్రరావు ప్రధానోపాధ్యాయులుగా పని చేయగా, తల్లి శకుంతలా బాయి వాయులీన విద్వాంసురాలు. చిన్నతనంలోనే పాఠశాలలో ప్రదర్శించిన 'లవకుశ' నాటకంలో లవుని పాత్ర పోషించడం ద్వారా ఆయనకు నటనపై మక్కువ ఏర్పడింది. ఆ కాలంలో టూరింగ్ టాకీస్‌లో వీక్షించిన 'సీతా కల్యాణం', 'శ్రీకృష్ణ లీలలు' వంటి పౌరాణిక చిత్రాలు ఆయన మనసుపై చెరగని ముద్ర వేశాయి. ఉదయగిరిలో 10వ తరగతి, గూడూరులో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆయన, ఆ తర్వాత చెన్నైలో బీఎస్సీ ఫిజిక్స్ అభ్యసించారు. చెన్నైలో చదవుకుంటున్న రోజుల్లో ప్రముఖ కవి, నాటకకర్త హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ మార్గదర్శకత్వంలో నాటకరంగంలో పూర్తిస్థాయిలో ప్రవేశించారు. అదే సమయంలో హాలీవుడ్ సినిమాలను సైతం విరివిగా చూస్తూ సినిమా నిర్మాణ మెలకువలపై ఆసక్తిని పెంచుకున్నారు.

**మాయాబజార్‌తో మొదలైన ప్రయాణం**

డిగ్రీ పూర్తి చేసిన అనంతరం కొంతకాలం సూళ్లూరుపేటలో ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో తానే స్వయంగా కొన్ని నాటకాలను రచించి, వాటిని తన విద్యార్థుల చేత ప్రదర్శింపజేసేవారు. ఆ తర్వాత కాలంలో భారతీయ చలనచిత్ర చరిత్రలో క్లాసిక్‌గా నిలిచిన 'మాయాబజార్' (1957) చిత్రానికి దిగ్గజ దర్శకుడు కె.వి. రెడ్డి వద్ద సహాయ దర్శకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. దిగ్గజ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు వద్ద శిష్యరికం చేసిన అనుభవమే, ఆయన తదుపరి కాలంలో ఎన్నో అద్భుతమైన మ్యూజికల్ చిత్రాలను తెరకెక్కించడానికి ప్రధాన కారణమైంది. ఆ తర్వాత దర్శకుడిగా మారి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో సినిమాలు తీశారు. రెండు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, ఐదు నంది అవార్డులు, కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు, ఫిల్మ్‌ఫేర్ సహా ఎన్నో అవార్డులు, రివార్డులు ఆయన్ను వరించాయి.

**ప్రముఖుల దిగ్భ్రాంతి**

లెజెండరీ డైరెక్టర్ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతిచెందడంపై సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆయన మృతి భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటు అని ప్రముఖులు కొనియాడుతున్నారు. ఈ నేపథ్యంలో సింగీతంతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటు నివాళులు అర్పిస్తున్నారు. ఈ క్రమంలో అగ్ర నటులు నందమూరి బాలకృష్ణ, చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు రాఘవేంద్రరావు సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేస్తున్నారు.

# జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ

**కేరళ సర్కార్ సంచలన నిర్ణయం**

**ఆత్మహత్యకేసులో దర్యాప్తు**

మహా : ఓట్ల చోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మరో షాక్ తగిలింది. ఓ సూసైడ్ కేసు ఆయన తలకు చుట్టుకుంది. కేరళకు సంబంధించిన ఓ పాత కేసులో కేరళం హోంమంత్రి రమేశ్ చెన్నితాల విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు 2006లో స్టేట్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా జ్ఞానేశ్ కుమార్ పనిచేసిన సమయంలో జరిగిన అవకతవకలపై ఈ దర్యాప్తు జరగనుంది. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ప్యాటీ బెల్ కన్సార్టియానికి చెందిన మలేసియా సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్ ఆత్మహత్యకు సంబంధించిన వ్యవహారంలో ఈ విచారణ చేస్తారు. లీ రాసిన సూసైడ్ నోట్‌లో జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో బాహ్య ఒత్తిళ్ల కారణంగా ఈ కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో తాజాగా విజిలెన్స్ దర్యాప్తునకు కేరళం హోంమంత్రి ఆదేశాలు ఇచ్చారు. జ్ఞానేశ్ కుమార్ ప్రమేయం ఉన్న ఈ కేసులో బయటి వ్యక్తుల ప్రభావం, తదితర ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రమేశ్ చెన్నితాల నేరుగా విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు హోంమంత్రి కార్యాలయం వెల్లడించింది.

పాత విచారణ ఫైళ్లను కోరిన హోంశాఖ

2006లో జ్ఞానేశ్ కుమార్ పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న సమయంలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై విజిలెన్స్, అవినీతి నిరోధక బ్యూరో (వీఏసీబీ) ద్వారా విచారణ జరిపించాలని హోంమంత్రి ఆదేశించారు. గతంలో వీఏసీబీ నిర్వహించిన ప్రాథమిక విచారణకు సంబంధించిన అన్ని ఫైళ్లను హోంశాఖ కోరినట్లు సమాచారం. అప్పటి విచారణ బాహ్య ఒత్తిడి కారణంగా దారి తప్పిందన్న ఆరోపణలను పరిశీలించాలని హోంమంత్రి ఆదేశించారు. ఈ కేసులో బాహ్య ప్రభావం ఉందన్న ఆరోపణ తీవ్రమైనదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌కు సూచించారు. ఓవైపు విపక్షాలు, సీజేపీ ఆందోళనలతో ఉక్కిరిబిక్కిరవుతున్న జ్ఞానేష్‌ను ఇపుడు పాత తప్పులు కూడా వెంటాడుతున్నాయి.

# పెమ్మసాని పొలిటికల్ హీరో

**గుంటూరు, మహా** : గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ లపై ప్రశంసల వర్షం కురిపించారు. వారి పనితీరును కొనియాడుతూ, కూటమి ప్రభుత్వంలో వారి పాత్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు బుర్రిపాలెం అనగానే సూపర్ స్టార్ కృష్ణ గారు గుర్తొచ్చేవారు. ఇప్పుడు ఇక్కడికి మరో హీరో వచ్చారు. ఆయన సినిమా హీరో అయితే, మన పెమ్మసాని చంద్రశేఖర్ పొలిటికల్ హీరో" అని అభివర్ణించారు. పెమ్మసానిని ఎంపీగా ఎంపిక చేసినప్పుడు తనకు కొన్ని సందేహాలు కలిగాయని చంద్రబాబు బహిరంగంగా అంగీకరించారు. "ఎక్కువకాలం అమెరికాలో ఉన్న పెమ్మసాని, ఇక్కడి ప్రజలతో పట్టు సాధించగలరా? వారితో మమేకం అవుతారా? అని నేను మొదట అనుమానించాను. కానీ ఈరోజు ఆయన ప్రసంగాలు, ప్రజలతో కలిసిపోతున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఒక సామాన్యుడిలా ప్రజల్లో ఒకరిగా మారిపోయి, అందరి బాగోగులు చూసుకుంటూ బ్రహ్మాండంగా ముందుకు దూసుకెళుతున్నారు" అని చంద్రబాబు కొనియాడారు. పెమ్మసాని ఆధ్వర్యంలో బుర్రిపాలెంలో చేపడుతున్న త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశానికే ఆదర్శం కానుందని పేర్కొన్నారు.

**నాదెండ్లపై ప్రశంసలు**

అదేవిధంగా, జనసేన నాయకుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పనితీరును చంద్రబాబు ఎంతగానో మెచ్చుకున్నారు. "నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. నిత్యావసరాల ధరలు కొంచెం పెరిగినా, వెంటనే నాకు ఒక చీటీ పంపించి పరిస్థితిని వివరిస్తారు. ధరలను నియంత్రణలో ఉంచడానికి మేము ఈ చర్యలు తీసుకుంటున్నామని చెబుతారు. పేద ప్రజలపై ధరల భారం పడకుండా అనునిత్యం పనిచేస్తున్న అత్యంత సమర్థవంతమైన మంత్రి మనోహర్" అని ప్రశంసించారు.

# పేదల గృహనిర్మాణంలో సరికొత్త శకం

( మొదటి పేజీ తరువాయి )

లాంఛనంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ 2.0 (పీఎంఏవైజీ) పథకం కింద నూతనంగా మంజూరైన ఏకంగా మూడు లక్షల గృహ నిర్మాణాలకు ఇదే వేదికగా వారు శంకుస్థాపన చేయడం విశేషం. అవాంతరాలు లేని వేగవంతమైన, పటిష్టమైన ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఈ భారీ ప్రాజెక్టును చేపడుతోంది.

సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేసే ఈ త్రీడీ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి మండలంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో ప్రయోగాత్మకంగా 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం అంచనా వ్యయం సుమారు రూ.14 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.9.44 కోట్లు భరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.49 కోట్లను వెచ్చిస్తోంది. సాధారణ నిర్మాణ పద్ధతులతో పోలిస్తే ఈ త్రీడీ ప్రింటింగ్ విధానంలో అత్యంత వేగంగా నిర్మాణాలను పూర్తి చేయవచ్చు. ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఆధారిత రోబోటిక్ ప్రింటర్ ద్వారా ముందుగానే రూపొందించిన ఆకృతికి అనుగుణంగా కాంక్రీట్ మిశ్రమాన్ని పొరలు పొరలుగా పేర్చుతూ గోడలను నిర్మిస్తారు. ఈ పద్ధతిలో సెంటరింగ్ సామగ్రి అవసరం ఉండదు. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా, సాధారణ ఇళ్ల నిర్మాణంతో పోలిస్తే సుమారు 50 నుంచి 70 శాతం వేగంగా ఇల్లు పూర్తవుతుంది. అలాగే నిర్మాణ సామగ్రి వృథాను 30 నుంచి 60 శాతం వరకు అరికట్టవచ్చు. వేసవి ఎండ తీవ్రతను సైతం తట్టుకుని ఇళ్ల లోపల చల్లని వాతావరణం ఉండేలా ఈ నూతన సాంకేతికతను డిజైన్ చేసినట్లు అధికారులు వివరిస్తున్నారు. పేదలకు కేవలం ఐదు రోజుల్లోనే ఒక పటిష్టమైన ఇంటిని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు పార్థసారథి, నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు పలువురు లబ్ధిదారులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి సంతోషాన్ని పంచుకున్నారు. గడిచిన 28 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 5.50 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న మరో 4.20 లక్షల గృహాలను రాబోయే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి పంపిణీ చేయాలని స్పష్టమైన లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. వినూత్న సాంకేతికతతో కూడిన ఈ బృహత్తర ప్రాజెక్టు విజయవంతమైతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల సొంతింటి కల అతి తక్కువ సమయంలోనే, అత్యంత నాణ్యతతో సాకారం కానుంది.

# తూంకుంటలో ఆగని అక్రమ షెడ్డు నిర్మాణం ..!

- **కథనాలు వచ్చినా.. ఆగని నిర్మాణ పనులు ..!**
- **జీరో పర్మిషన్‌తోనే యదేచ్ఛగా కొనసాగుతున్న వైనం ..!**
- **టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నట్లా.. లేనట్లా..?**
- **ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!**
- **ఫిర్యాదులు.. కథనాలు.. అయినా చర్యలు శూన్యం..!**
- **ఎం ఎం సీ కమిషనర్ స్పందిచాలంటున్న స్థానికులు...!**

**మహా, శామీర్పేట్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట్ మండలం, కీసర సర్కిల్, తూంకుంట డివిజన్ పరిధిలో హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని కొనసాగుతున్న భారీ షెడ్డు నిర్మాణంపై గతంలో కథనం వెలువడినా.. నిర్మాణ పనుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ భారీ షెడ్డు నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వారు పేర్కొంటున్నారు.

**కథనం వచ్చినా.. ఆగని పనులు..!**

తూంకుంట నడిబొడ్డున, ప్రధాన రహదారికి ఆనుకుని సుమారు ఎకరం విస్తీర్ణంలో భారీ షెడ్డు నిర్మాణం జరుగుతున్న వ్యవహారం ఇప్పటికే స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన అనుమతులు లేకుండానే యదేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ నిర్మాణంపై వార్తా కథనం వెలువడినప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. భారీగా ముడుపులు ముట్టడంతోనే సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**జీరో పర్మిషన్‌తోనే భారీ షెడ్డు..?**

భారీ వాణిజ్య నిర్మాణానికి అవసరమైన అనుమతులు, ప్లాన్ అప్రూవల్, ఇతర సంబంధిత అనుమతులపై స్పష్టత లేకుండానే పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డీమార్ట్ లేదా ఇతర భారీ రిటైల్ వాణిజ్య కార్యకలాపాలకు అనువుగా ఈ షెడ్డు నిర్మిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వివరాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

***కనీసం నోటీసులు కూడా జారీ చేయని వైనం ..?**

అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతోందన్న ఫిర్యాదులు, వార్తా కథనాలు అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ.. ఇప్పటివరకు కనీసం నోటీసులు జారీ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్మాణ అనుమతులను పరిశీలించడం, ఉల్లంఘనలు ఉంటే పనులను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




**టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నట్లా.. లేనట్లా..?**

ప్రధాన రహదారికి ఆనుకుని భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ఎలాంటి స్పందన కనిపించకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి నిర్మాణాల విషయంలో వెంటనే నిబంధనలు, అనుమతుల పేరుతో చర్యలు తీసుకునే అధికారులు.. ఇంత భారీ నిర్మాణం విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు స్పందించకపోవడంతోనే నిర్మాణదారులకు ధైర్యం వస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!**

భారీ వాణిజ్య నిర్మాణాలకు సంబంధించి అనుమతులు, ప్లాన్ అప్రూవల్, డెవలప్‌మెంట్ ఛార్జీలు, ఇతర రుసుముల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరాల్సి ఉంటుంది. అయితే అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణానికి సంబంధించిన పూర్తి అనుమతులు, చెల్లించిన రుసుములు, భూ వినియోగం తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

**ఇప్పటికైనా చర్యలు తీసుకునేనా..?**

ఇప్పటికే నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉంటే వాటి వివరాలను వెల్లడించాలని.. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే తూంకుంటలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరు ప్రశ్నార్థకంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంఎంసీ కమిషనర్ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆదేశించి, ఈ అక్రమ నిర్మాణంపై తగిన చర్యలు తీసుకుంటేనే అధికారులపై ఉన్న అనుమానాలు తొలగిపోతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# కుప్పంకు నీళ్ళు..పాలమూరుకు కన్నీళ్ళా?

- **టీఆర్ఎస్ చీఫ్ కవిత హాట్ కామెంట్స్**
- **కరువు మండలాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్**

**హైదరాబాద్, మహా** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరురంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 67 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.



# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయం...!

- **విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ పాత్రికేయుల సంక్షేమానికి సమిష్టి కృషి...!**
- **న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్‌తో అసోసియేషన్ నేతల కీలక భేటీ...!**

**కాప్రా, అక్టోబర్ 4 (మహా):** రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లాలని సంఘం నాయకులు నిర్ణయించారు. అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత కమిటీల విస్తరణ, నూతన బాధ్యుల నియామకాలు, పరిపాలనా వ్యవహారాలపై చర్చించేందుకు సంఘం ముఖ్య ప్రతినిధుల బృందం న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులను ఒకే తాటిపైకి తీసుకురావడం, పాత్రికేయులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంస్థాగత కమిటీలను విస్తరించి మరింత మంది పాత్రికేయులను సంఘంలో భాగస్వాములను చేయడంతో పాటు, పరిపాలనా వ్యవహారాలను సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. సంఘం ఎదుగుదలకు, సభ్యుల సంక్షేమానికి చట్టపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అవసరమైన న్యాయపరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం అసోసియేషన్‌లో నూతనంగా నియమితులైన వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.వి. లక్ష్మి, ఉపాధ్యక్షులు ఉల్లోజు శ్రీనివాసాచారి, సలహాదారు తాడికొండ రమేష్‌లకు నియామక పత్రాలను అందజేశారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల అభ్యున్నతే లక్ష్యంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. నరసింహాచారితో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



# సైనిక్‌పురి సీఎస్‌సీలో 'పీఎం సూర్యఘర్'పై అవగాహన సదస్సు...!

**సైనిక్‌పురి, అక్టోబర్ 4 (మహా ):** ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. సేవా సేతు కార్యక్రమంలో భాగంగా సైనిక్‌పురి డివిజన్‌లోని సిటిజన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో 'పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వినాయకనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ శాఖ డీఈ అన్వర్ పాషాతో పాటు పలువురు ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది, సోలార్ వెండర్ విజయపాల్ రెడ్డి, ఇతర వెండర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు వల్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, అర్హతలు, దరఖాస్తు విధానం, సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను వినియోగదారులకు వివరించారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. పథకానికి సంబంధించి వినియోగదారులు అడిగిన పలు సందేహాలను అధికారులు, సోలార్ వెండర్లు నివృత్తి చేశారు. ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




'పీఎం సూర్యఘర్' అవగాహన సదస్సులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాజలక్ష్మి, డీఈ అన్వర్ పాషా, సోలార్ వెండర్ విజయపాల్ రెడ్డి, అధికారులు




## తెలంగాణ భాషా కథా సంకలనం కోసం...

తెలంగాణ భాష ప్రత్యేకతను చాటుతూ, మాది తెలంగాణ భాష అని ప్రకటిస్తూ, తెలంగాణ భాషా సౌందర్యాన్ని ఇనుమడింప చేసి, సాహితీ గౌరవాన్ని నిలబెట్టే ఉద్దేశ్యంతో సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబల సంపాదకత్వంలో 19902026 మధ్యకాలంలో వచ్చిన కథల సంకలనాన్ని వెలువరించాలని నిర్ణయించాము. కథలు పూర్తిగా తెలంగాణ భాషలో, ఈ ప్రాంత జీవితాలను చిత్రించినవై ఉండే కథలను సంకలనం చేస్తున్నాం. ఈ నేపథ్యంలో మీ కథను సంకలనంలో చేర్చాలని నిర్ణయించాము. మీరు తెలంగాణ భాషలో రాసిన మీ కథను ఒక దానిని అక్టోబర్ 10, 2026లోగా పంపించవలసిందిగా విజ్ఞప్తి. అట్లాగే వీలైతే మీకిష్టమైన తెలంగాణ భాషా కథలను రెండింటిని సూచించవలసిందిగా మనవి. డిసెంబర్‌లో జరిగే హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఈ కథా సంకలనం ఆవిష్కరణ ఉంటుంది. కథ విడిగా పేజ్ మేకర్ 7.0 లో గానీ యూనికోడ్‌లో గానీ పంపిస్తే మంచిది.

**- సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ**
sangjshettysrinivas@gmail.com

## పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి**
**కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

# బుడగ

కథ


-బమ్మిడి జగదీశ్వరరావు
9490696911

గాలిలో దీపం పెట్టారు.
'దేవుడా... నీదే భారం' అన్నారు. అన్నా సరే, దేవుడెదురుగా వున్నాసరే, గాలికి దీపం అటూ యిటూ రెపరెపలాడుతూ వూగింది.
కొందరు భక్తులు పరుగున వెళ్ళి అరచేతులు అడ్డు పెట్టారు.
ఆ దృశ్యం చూస్తున్న కొడుకుతో 'దేవుడి మీద భారం వేస్తే సరిపోదు. మన ప్రయత్నం మానవ ప్రయత్నం వుండాలి' అని తల్లి అర్థమయ్యేలా చెప్పింది.
ఆమాట వినేసిన స్వామీజీకి మనోభావం గాయపడింది. ఆ తల్లితో 'నువ్వు మాట్లాడేది తప్పు' అన్నారు. ఇటు తిరిగి భక్తులతో 'మీ అరచేతులు తీసేయండి' అని గొంతు పెంచి అరిచారు స్వామీజీ.
దీపం నుండి దూరం జరిగిన భక్తులు స్వామీజీకి దగ్గరగా జరిగారు. ఏదైనా అపచారం చేశామేమో అని తమని తాము అనుమానిస్తూ చుట్టూ గుమికూడారు.
స్వామీజీ మాటలు మనుషులకు అర్థమైనట్టు గాలికి అర్థం కాలేదేమో కలియదిరుగుతూ దీపాన్ని కలవరపెట్టింది.
'దేవుడు నీ భారాన్ని నా భారాన్ని మనందరి భారాన్ని మోస్తున్నాడు, అంతకంటే మన ప్రయత్నం మానవ ప్రయత్నం గొప్పదేం కాదు' అన్నారు స్వామీజీ. 'నేను యింత తప్పు మాట్లాడేశానా?' అన్నట్టు బాధపడిపోయింది ఆ తల్లి.
అర్థం అయ్యీ కాకుండా చూస్తున్న పిల్లాడ్ని చూసి 'మీరు యిలా రేషనల్‌గా పెంచితే, రేపు పెరిగి పెద్దయి సైన్సు గొప్పదని సనాతనాన్ని కాలరాస్తారు' అని స్వామీజీ బాధపడ్డారు. ఆ మాటలు విని భక్తులు రేపటి నేరస్తుణ్ణి యిప్పుడే చూస్తున్నట్టు ఆ పిల్లాడి వంక చూశారు.
ఇంతలో వెలుగుతున్న దీపం ఆరిపోయింది.
భక్తులంతా అశుభం అనుకున్నారు. లెంపలు వేసుకున్నారు. దీపం గాలికి ఆరలేదని, అరచేతులు అడ్డు పెట్టడం వల్ల అపవిత్రం అయి ఆరిపోయిందని స్వామీజీ చెప్పారు. తాము అపవిత్రులమైనట్టు నిజాన్ని అంగీకరిస్తున్నట్టు వొక్కరు కూడా కిక్కురు మనలేదు.
తనమీద భక్తులు అనుమానపడుతున్నారన్న అనుమానం రావడంతో స్వామీజీ ముందుకు చాచి అరచేతిని విప్పారు. చిత్రంగా చేతిలో దీపం వెలిగింది.
చూశాడు.
భక్తులైన పెద్దలు చప్పట్లు చరిచారు. ఆపై చేతులు జోడించారు.
స్వామీజీ అనుచరుడు చప్పట్లు ఆపమన్నట్టు అరచేతిని చూపాడు.
అంతా నిశ్శబ్దం.
'ఇప్పుడు చెప్పండి' అన్నాడు ప్రధాన శిష్యుడు. 'ఈ దీపం గాలికి ఆరదు' అన్నాడు.
భక్తుల తలలు వూగాయి.
'ఈ దీపానికి ప్రమిదె లేదు' అన్నాడు అనుచరుడు.
'చమురు కూడా లేదు' అన్నాడొక భక్తుడు.



కళ్ళు పట్టలేని ఆశ్చర్యంతో చూస్తున్న భక్తుల్ని గమనించిన స్వామీజీ ప్రధాన శిష్యుడు 'మీ జీవితం ధన్యమైంది. స్వామివారి హృదయ దీపాన్ని దర్శించే అదృష్టం మీకు కలిగింది. ఈ దీపం గాలికి ఆరదు' అన్నాడు. ప్రసన్నంగా తలాడిస్తూ భక్తుల్ని పరికించి
'నిప్పు కూడా లేదు' పారవశ్యంలో అనేసి, తన తప్పు అర్థమయినట్టు నాలుక కరుచుకున్నాడు మరో భక్తుడు.
ఆ మాటనీ భక్తుల మనస్సులనీ మరల్చడానికి స్వామీజీ ఆ దీపాన్ని నోట్లో బఠానీ గింజ వేసుకున్నట్టు వేసుకున్నారు. నవ్వుతూ పెదవులు మూశారు. గుటుక్కుమనిపించినట్టు గొంతు దగ్గర గుటక పడడం కూడా కనిపించింది.
ప్రత్యక్షంగా దేవుణ్ని చూస్తున్నట్టు భక్తులందరూ జోడించిన చేతులతో స్టాచ్యూల్లా నిలబడిపోయారు. మరికొందరు 'స్వామీజీ మహారాజ్‌కీ జై' నినాదాలిచ్చారు. ఆ ప్రదేశమంతా మార్మోగిపోయింది. ఆ దేవుడే తానై దిగివచ్చినట్టు కరుణ చూపులు చూశారు స్వామీజీ. అరచేతిని చూపిస్తూ అడక్కుండానే అందరికీ దీవెనలు యిచ్చారు.
అప్పుడు వొక చిన్న పాప నోటిముందు మైకు పెట్టి చెప్పమన్నట్టు అనుచరుడు నవ్వుతూ తలాడించాడు. స్వామీజీ కూడా అనుమతి యిస్తున్నట్టు తలూపారు.
'మేజిక్ బావుంది అంకుల్, యూ ఆరే గుడ్ మెజీషియన్' అని తలూపుతూ చిన్ని చేతులతో చప్పట్లు చరించింది పాప.
ప్చ్... మళ్ళీ స్వామీజీ మనోభావం గాయపడిన శబ్దం యెవరికీ వినిపించకపోయినా ఆయన కళ్ళలో మాత్రం కనిపించింది!

## రంగువెలిసిన "చేనేత"

నరాలనే దారాలు జేసి,
రుధిరాన్ని రంగుగా అద్ది,
మనిషి సిగ్గును కప్పిన కళనేత!
నగ్న సమాజానికి సింగారాల
రూపమిచ్చిన నేతన్న!

పత్తిని వడికి పట్టు జేసి,
మగ్గపు సాలెతోడు తాను కరిగి,
నెత్తికి రుమాలై, మొలకు పంచై,
ఒంటికి చొక్కై,
అమ్మకు ఆరుగజాల చీరై,
ఆడబిడ్డల లంగాఓణీలవుతూ...
పండుగకు పట్టుబట్టలై,
సావడి పెండ్లికి తలంబ్రాలైన బతుకు సాలు!
పురిటి కాన్పు నుంచి, కాటి బట్ట దాకా
మనిషి నడకకు తోడొచ్చిన ప్రాణస్నేహం!

గజం గజంగా దారాన్ని పేర్చి,
ఆరు గజాల చీరల ఆరు వందల కళలు,
తొమ్మిది గజాల ముదుతల్లో
తరతరాల మన సంస్కృతి,
పదహారు వన్నెల పొంగులు,
అల్లికల నగిషీల నైపుణ్యాన్ని,
చీర కొంగున జాతి జ్ఞాపకాన్ని నేస్తూ
దేశపు ఆత్మగౌరవాన్ని నిలబెట్టిండు.

రాట్నం తిప్పి తిప్పి
చేతులు వరిపోసలైనయి...
వేళ్లు వంకరబోయినయి...
గంతైనా... ఆ మగ్గం వస్త్రంల మాత్రం
వన్నెలు పూస్తూనే ఉన్నయి!

పేగుల్నే పోగులుగా మార్చి,
దేశపు జెండాను నేసి,
స్వాతంత్ర్య పౌరుషాన్ని నింగికెగరేసిన మగ్గం అది!
కానీ, అగ్గిపెట్టెలో ఆరుగజాల చీరను దాచి
దునియాను ఆశ్చర్యపరిచిన ఆ చేతులు...
ప్రపంచం చప్పట్లు కొట్టిన చోట,
తమ ఇంటి పొయ్యిల మాత్రం పొగను మరిచినయి!

మగ్గం ఆగలేదు,
మనిషే ఆగిపోయిండు!
దారానికి ధర ఉంది,
చీరకు ధర ఉంది,
కార్పొరేట్ బ్రాండుకు ధర ఉంది...
కానీ, దారాన్ని నేసిన చేతికి మాత్రం వెల లేదు!
ఆకలి... ఆకలి... ఆకలి...
నరాలు తెగే ఆకలి!
వెట్టి పనిగంటల ఆకలి...
పొట్టను మాడ్చే కడుపుకోత!

మగ్గాన్ని సిలువ జేసి,
నేతన్నను
ఉరితాడుకు వేలాడదీసిన కాలమిది.
ఆకాశపు ఇంద్రధనుస్సును ముద్దాడే మార్కెట్టు,
నేల మీద కురిసిన చేనేత సింగిడిని ముంచిపారేసింది!
రంగులన్నీ చీరలకు అలంకారాలైనయి,
అతని బతుకులకు మాత్రం రంగు వెలిసిపోయింది!

చేతులకు పని లేదు...
ఇప్పుడు కంప్యూటర్‌కు పని ఉంది,
మెషీన్లకు పని ఉంది!
వేళ్లకు దారం దొరకదు కానీ,
కీబోర్డుకు మాత్రం వేళ్లు దొరికినయి!

సముద్రమంత
మానవ వనరులున్న దేశంల,
సచ్చిపోయేంత ఆకలితో
సగం బతుకులు రోడ్డున పడ్డయి!

ప్రపంచీకరణమ్మ...
కొత్త కంపెనీల రంగు చీరలను కట్టుకుని మురుస్తోంది,
ఆమె కట్టుకున్న ఆ చీర...
నేతన్న బతుకును వెలిసిపోయిన గుడ్డలా వీధి అంచున పడేసింది!
ఒకప్పుడు దేశపు దేహాన్ని కప్పిన చేతులు,
నేడు తమ ఒంటిని కప్పుకోలేక చలికి వణుకుతున్నాయి!

కలంకారీ చేనేతను
కప్పుకున్న దేవత మురిసిపోయింది,
ఆ దేవుడు కూడా మురిసిపోయిండు!
కానీ...
బాధలొచ్చినప్పుడు ఏ దేవుడికీ కాళ్లు రాలేదు,
ఓట్లప్పుడు తప్ప ఏ రాజకీయానికీ ముఖం రాలేదు!
మగ్గం మాత్రం
మూగగా ఏడుస్తూనే ఉంది...

రాట్నాలున్నయి,
మగ్గాలున్నయి,
పవర్‌లూములు ఉన్నయి...
కానీ నేతన్న చేతికి మాత్రం
దారం దూరమైపోయింది,
నోటికి ముద్ద భారమైపోయింది!

చీరల పూలనద్దిన చేతులు
తమ బతుకులకు ముళ్లనే నేసుకున్నయి!
అంచు కొంగున పండుగను అల్లిన చేతులు
తమ ఇంటి గడపకు ఆకలినే వేలాడదీసినయి!

వస్త్రం ప్రపంచాన్ని కప్పింది,
కానీ నేతన్న నగ్నత్వాన్ని కప్పలేకపోయింది!
చేనేత పాడె మీదికి ఎక్కి పడుకున్నది
ఒక మనిషి శవం కాదు;
ఒక వృత్తి,
ఒక కళ,
ఒక సంస్కృతి...
ఒక సుదీర్ఘ చరిత్ర తలవాల్చి పడుకుంది!

ఇప్పుడు ఆ చేనేత దేవత కన్నీళ్లు కార్చదు,
ఏ దేవుడికీ కాళ్లు రావు,
ఏ రాజకీయానికీ ముఖం చెల్లదు!

మగ్గం మాత్రం మూగగా నిలదీస్తోంది...
"నా ఆశల దారాన్ని తెంచింది ఎవరు?" అని!
చీర మడతల్లోంచి ఆకలి కేక వినబడుతోంది:
"నేను నేసిన గుడ్డను కప్పుకున్న దేశమా!
నన్నెందుకు గుడ్డల్లేకుండా వదిలేశావు?"

దారాలింకా ఉన్నయి,
మగ్గాలింకా ఉన్నయి,
చేతులింకా ఉన్నయి...
లేనిదల్లా ఒక్కటే —
ఆ చేతులకు బతికే హక్కునిచ్చే
ఒక న్యాయమైన మద్దతు ధర!

జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్నప్పుడల్లా
నాకు మగ్గానికి వందనాలు చేస్తున్నట్లే ఉంటది!

చేనేత వస్త్రాలను ఆదరిద్దాం...

**వనపట్ల సుబ్బయ్య**
**9492765358**

## మరిచిపోతే కాలం మళ్లీ నడక నేర్పించదు

నా కళ్లల్లో కనిపించే నవ్వు
ఎన్నోసార్లు దుఃఖం వొలికి పోయాక
వచ్చింది
ముఖం మీది ప్రశాంతత
చాలా తుఫాన్లు తాకాక నిలిచింది

చేతులు కాలి గాయాలయ్యాక
వెలిగించిన దీపం, చీకట్లను
తరిమింది
పడగొట్టి, పడగొట్టి, కాలం నడకనే
ర్పుతుంది
మరిచిపోతే నిన్నటి అడుగు, మళ్లీ
నేర్పించదు

నా ప్రేమనంతా అందరికీ పంచి
పెట్టాను
నేను ఆత్మీయత కోరుకొన్నప్పుడు
కొన్ని చీత్కారాలు, కొన్ని కోపాలు
దొరికాయి

కొంతైనా మనకోసం జీవితాన్ని
దాచుకోవాలి
ఎవరూ అలసిపోయావా అని
అడగరు
చలికాలం వచ్చింది, నీకు స్వెటర్
తెచ్చాం అనరు

నవ్వే పెదాలావెనక, ఒక ప్రశ్న
వుంటుంది
కళ్ల నిశ్శబ్దం చాటున, చెప్పలేని కథ
వుంటుంది

చందమామ లేకపోయినా రాత్రి
గడుస్తుంది
దారితెలియక పోయినా దినం
నడుస్తుంది
మనిషి ప్రయాణం ఆగేది కాదు
జీవితం ఒడిపోయి వెనక్కి తిరిగి
పోదు

**ఆశారాజు**
**9392302245**

## పసిమట్టి

అప్పుడెప్పుడో మొన్నలనుంచి
కన్నుల తడి ఆరని నిన్నల నుంచి
పచ్చి పచ్చిగా ఉన్న ఈ క్షణం దాకా...
గాయ బిందువు నుంచి
దుఃఖ సముద్రం దాకా
సగం తెగిన కలల నది
ఎడతెగని ప్రయాణం!

నాలో ఓ మూల
ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తున్న
నెక్కరేసుకున్న పదేళ్ల కుర్రాడొకడు!

ఎక్కడో పడిపోయింది
వాడి రంగు రంగుల బతుకు గోళీ...
చాచిన చేతికి
ఇంకా అందని వాడి ఆకాశం!

అప్పుడప్పుడు
తోకచుక్కల్లా
తెగి పడుతూనే ఉంటాయి కన్నీళ్లు!

రాత్రులు రాల్చిన పూల కుప్పలలో
ఆచూకీ చిక్కని ఉదయాల కోసం...
గుండె కళ్లతో
కాలాన్నంతా గాలిస్తూ ఉన్న
వెర్రి ఆరాటమొకటి!

వయసు
తల మీద తెలుపు రంగులోకి మారుతున్న
కొద్దీ...
మనసెందుకో
ఒంటినిండా 'పసిమట్టిని' పూసుకుంటున్నది!

**రహీమొద్దీన్**
**9010851085**

# అట్టడుగున దాగిన కథల "లేపాక్షి"

ప్రఖ్యా త రచయిత, ఎన్నో అవార్డుల స్వీకర్తసడ్లపల్లె చిదంబర రెడ్డిరచించిన "లేపాక్షి" నవల రాయల వారసుల కాలం నాటిపెనుగొండ పరిసర ప్రాంతాల సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను, హేతువాద పద్ధతిలో గ్రామీణ శ్రమ జీవుల కోణం నుంచి చిత్రించింది. చారిత్రకనవలల్లో వాస్తవం ఊహలు కలిసిఉండటం మామూలు కానీ, వాస్తవం ప్రశ్నార్థకంగా, ఊహ పుక్కిటిపురాణంగా ఉంటేదానికిమన్నన ఉండదు. చారిత్రక రచనలో వస్తుగత వాస్తవికత అనేదివ్యక్తిగత అంశం లేకుండా ఉండదు. చరిత్రకారుల, నవలా రచయితల అనివార్య పక్షపాతం తెలిసిందే. అయితేచరిత్రసారం శ్రీశ్రీ అన్నట్లు
"ఆ రాణిప్రేమ పురాణం , ఈ ముట్టడికైన ఖర్చు లు" మాత్రం కాదు అని "లేపాక్షి" నవల నిరూపిస్తుంది. ఈనాడు హిందుత్వ వాదులు హిందూ రాజులను పొగుడుతూ, బ్రిటీష్ వ్యతిరేకంగా పోరాడిన టిప్పు సుల్తాన్, మత సామరస్యా న్ని చెప్పిన అక్బర్ లను కూడా విచక్షణా రహితంగా తిట్టడం చూస్తున్నాం. నేటి ప్రజాస్వా మ్యంలో చరిత్రను రాజుల మధ్య రణాలుగా కాకుండా పీడకుల, పీడితుల మధ్య కుల, వర్గ వైరుధ్యా ల అనివార్య ఘర్షణగా వ్యా ఖ్యా నించటం అవసరం.
చరిత్రకారుడు ఏ ఎల్ భాషం "దివండర్ దట్ వాజ్ ఇండియా" లో విజయనగర సామ్రాజ వైభవం గురించి ఇటాలియన్ నికొలో డా కాంటి, పోర్చు గీసు యాత్రికులు పేస్ ,న్యూ నిజ్ లు పొగడటం, బలహీనుడైన అచ్యు త రాయల ఉద్యోగులు ప్రజలను అణచి వేయడం, 16వ శతాబ్ది విజయనగర సామ్రాజ్యంలో బానిసల సంత, కృష్ణదేవరాయలు పెద్దచెరువుని విజయవంతంగా నిర్మించడానికి 20,000 మందిశ్రామికులను వాడటం, దేవతల మెప్పు కోసం ఖైదీలను నరబలి చేయటం, ఆనాటిశిల్ప కళలో పాండ్య , హోయసల శిల్పకళ లక్షణాలు, మండపాల గోడలు స్తంభాలపైఅపురూపమైన బొమ్మలు చెక్కడం . తెలుగు ఆస్థాన భాషగా మారటం ప్రస్తావించారు.




"లేపాక్షి" నవలలో ఊళ్ళ పేర్లు (మడకశిర, పావగడ, హిందూపురం, లక్ష్మీ పురం, సజ్జల పల్లి మొదలగునవి ఎలా వచ్చి ంది) అచ్యు తరాయల కాలంలో అతనిని దించి అధికారానికైఅళియ రామరాయలు చేసేకుట, అంతఃపుర కుట్రలు, చేనేత పని వారిగురించి, ధాన్యం ఏ విధంగా దాచేవారు, రాజ్యా లు ఏ విధంగా కోశాగారం మీద ఆధారపడతాయో, రాజుల సంపద సామాన్య ప్రజలపై, సానులపైవేసేపన్ను లపైఉంటుందో(ఈనాడు మద్యం పైన ఆధారపడినట్లు) , తిప్పే గౌడ, క్రిసిటప్ప లాంటిఅధికార కామాంధుల దౌర్జన్యా లు, శిల్పకళాచార్యు ల, శిల్పు ల ఏకాగ్రత , సమాజంలో అణగారిన , నర్తకిస్త్రీల
స్త్రీ రంగాజమ్మ, కుప్పా యమ్మ, ఆమెతనయ పద్మిని, తిమ్మక్క ఆవేదన, సమాజ
హితం కోసం ప్రగతి కోసం పరితపించేపద్మిని రాయల కోట రక్షణ కికందకాలలో తాను ఒక్కో సారిమొసళ్ళ ఆహారం కోసం ఖైదీలను, రోగిస్టులను వేయడం వల్ల తన కొడుకు వీరభద్రం అనారోగ్యం పాలయాడని విరూపణ్ణబాధ, గుడి నిర్మా ణానికిపూనుకోవడం, కుట్రవల్ల విరూపణ్ణను పదవి నుంచి దింపికటకం క్రిసిట్ప పెనుగొండ మండలాధీశుడు కావటం , విరూపన్న కొడుకు వీరభద్రం, అతడ్ని ప్రేమించిన పద్మినీ ఇద్దరూ కామాంధుడు అయిన క్రిసిట్ప , అతడి అనుచరుల దాడిలో మరణించడంతో నవల విషాదాంతం గా మారింది.
దీనితోపాటు స్వపయోజ జన పరులైన స్వా ములు, నంజుడప్ప అన్యా యాన్ని ఎదిరించి అక్క కూతురు మాన రక్షణకు పెత్తందారును శిక్షించి, వాని మనుష్యుల ప్రతీకార దాడిలో భార్య, కూతురు పద్మిని నీ కోల్పోయి తత్వం చెప్పే తిక్క సామి గా మారటం , సామాన్య జనంలోని భక్తిభావాలు, జాతర్లలో నృత్య ప్రదర్శన సమయాలలో ఆకతాయిల చేష్టలు రచయిత వివరించారు. 16వ శతాబ్దం నాటిభూస్వా మ్య రాచరిక వ్యవస్థవిశేషాలు వివరించారు. చెరువుకు గండిపడితే దళిత బాలిక హొన్నమ్మ ను బలవంతంగా సంప్రదాయం పేరిట ఆత్మా ర్పణ చేసేలా చేయటం, అంతకుముందు హొన్నమ్మ పైఅత్యా చారయత్నా న్ని చేసినందుకు తిప్పే గౌడ నుఎదిరించిన ఆమెబావ సత్తెప్ప హత్య తదితర విషయాలున్నా యి.
నదులు నుంచి తయారైన ఉప్పు ను మాతమ్ర పేవాడమని ముస్లింలకు, స్థానిక వుప్పర్లమధ్య తగాదా నిర్మూలనకు. విరూపణ్ణశాసనం చేస్తాడు. సంప్రదాయ మార్పు లో మార్పు అవసరం గురించి ద్వా రా అతడి మంత్రి తో రచయిత చెప్పిస్తున్నా రు .పద్మిని సలహా వల్లఆడ బిడ్డలకు రవికె, చీర పెట్టేగౌరవం ఇచ్చే గౌరమ్మ పండగ ఎలా వచ్చి ంది, తమపైపన్ను లు వేసిరోగాలు వస్తేపట్టించుకోరని వాపోయేమేడసాని తిమ్మక్క, గిట్టుబాటు ధరల కోసం కాపుల్ని
వర్తకులకు వరహా ఇవ్వమంటేవారిబాధ, ఎద్దుల ప్రేమికుడు గవప్ప గవిరెడ్డిగా మారిపెత్తనం చేసేవైనం , శిలలు శిల్పా లుగా మారేక్రమం ఉన్నా యి.
రాతిగుండు చుట్టూ మొక్కల్ని తల్లిలా ఉన్నా యని, ఒకటికాపు వనిత సద్దిమోసుకుపోతున్నట్లు , మరొకటి రాళ్ళు తల్లి ఒడిలో బిడ్డలా ఉన్నా యనీ రచయిత పోల్చడం, పద్మినీ , వీరభద్రం ల సమాజ హితాభిలాష వర్ణన చాలా బాగుంది. అలాగేఆచార్యు లు విరూపణ్ణను గుడికట్టించమని కోరటం , అదిశివాలయం లేదా వైష్ణవాలయమా అనేప్రభావితం చేసేందుకు చర్చలు , నిర్మా ణానికిరాళ్ళు తెచ్చేందుకు జనం శ్రమ తో రహదారులు వేయటం, శిల్పు లలో, పని వారిలో కుల బేధాలు, రాళ్ళు మోసేందుకు ఏనుగులు లేకపోవడంతో ఎద్దులను, ఎనుబోతులను వాడటం , ఆ క్రమంలో మరణించిన గొప్ప ఎద్దు గవిరాజు కు నివాళిగా ఒకేరాయి నుంచి బసవన్న నిర్మా ణం కూడా ఉన్నా యి. లేపాక్షి పేరు ప్రచారంలో ఉన్న కథ ప్రకారం రాముడు జటాయువును " లేపక్షి " అనటం వల్లవచ్చిందిం.కానీశిల్పులుమండపాలపైకప్పుకులేపేముందు రాళ్లపైబొమ్మలు చిత్రించి , వాటికిగుర్తించిన సంఖ్యల ప్రకారం పైకిచేర్చి , వాటిని పరిచినపుడు మధ్య ఖాళీలకు రంగులు పూ సేవారు. లేపుల అచ్చు లు కలిసిలేపాచ్చు లయి కాలక్రమంలో లేపాక్షిగా మారిఉండవచ్చని రచయిత రాయటం వాస్తవానికిదగ్గరగా ఉన్నది. ప్రఖ్యా త రచయిత సల్మా న్ రష్దీనవల "విక్టరీసిటీ" నవల సైతం వాస్తవాలు, ఊహల్ని మేళవించి మ్యాజికల్ రియలిసం శైలిలో విజయనగర చరిత్రపుట్టుక, వైభవం, దాని విషాదాంతాన్నీ రికార్డు చేస్తుంది. సామ్రాజ్యా లు లేచి, కూలినా భిన్న కథనాలలో అక్షరాలు మాత్రమ బేతీరకాయి. నేడు మానసిక విభజన పెరిగిపోయి, భిన్న మతాలు, జాతుల మధ్య వైషమ్యా ల కన్నా మానవత్వం మిన్న అని చరిత్రచెబుతుంది. "విక్టరీసిటీ" లాగానేచిదంబ రెడ్డి "లేపాక్షి" నవల పాఠకులను ఆద్యంతం ఆసక్తికరంగా చదివిస్తుంది.


**జే రవీంద్రనాథ్**
**8978131585**



## హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగిస్తాం

- తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరింది

**హైదరాబాద్ అక్టోబర్ 4 మహా** : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి, ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు కోరారు. ఆల్వాల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో TUF తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్త, బాన్సువాడ మండల కార్యదర్శి దమ్మణపేట భాస్కర్ గౌడ్, సంజీవ్ రెడ్డి, సత్యనారాయణ, పి. బస్వారాజ్, పరమేశ్వర్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హుజురాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ అవునూరి సమ్మయ్య హాజరయ్యారు. ఆల్వాల్ జేఏసీ సభ్యులు పట్లోలా సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, అనంతుల సంతోష్, డోలి సుధీర్, భాస్కర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కూటమి నేతలతో ఎమ్మెల్యే పాయం కీలక భేటీ..

- - యూనియన్ ఎన్నికలు, కార్మికుల సమస్యలపై చర్చ..



**మణుగూరు, మహా** : తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు డిపోకు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ), టీఎంయూ, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కూటమి సంఘాల నాయకులు ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి చర్చించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు యూనియన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ప్రచారం, మూడు సంఘాల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. మణుగూరు ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 241 మంది ఓటర్లు ఉన్న విషయాన్ని సంఘాల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సంఘాల నాయకులు ఐక్యంగా, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్మికుల సమస్యలను సమష్టిగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కూటమి ఎన్నికల సమన్వయానికి సంబంధించి పిఎస్ రెడ్డి, ఆర్ఎం రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టి.ఆర్.ఎల్. చారి - ఐఎన్‌టీయూసీ డిపో కార్యదర్శి, బి రాములు నాయక్ - తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ డిపో కార్యదర్శి, తాటి సుధాకర్ - ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) డిపో కార్యదర్శి, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కూటమి సంఘాల ప్రతినిధులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## బెంగాల్‌లో సీపీఎం సభపై దాడిని ఖండించాలి

**వలిగొండ, మహా:** బెంగాల్‌లో సీపీఎం నిర్వహించిన బహిరంగ సభపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని దేశవ్యాప్తంగా ఖండించాలని సీపీఎం మండల సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బిపణి మోర్ వద్ద జరిగిన సభపై దాడి చేసి సీపీఎం కార్యకర్తలపై దాడి చేయడంతో పాటు వేదికను, సామగ్రిని ధ్వంసం చేశారని ఆరోపించారు. మహిళా కార్యకర్తలపైనా దాడికి పాల్పడ్డారని, ఈ ఘటన పోలీసుల సమక్షంలోనే జరిగిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ ఇలాంటి అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ అరాచకాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## దుకాణదారుల సమస్యలకు పరిష్కారం



**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లో స్వయంగా దుకాణాలు నిర్వహిస్తున్న 26 మంది దుకాణ యజమానులు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావును శివపల్లి గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లోని దుకాణాలను దుకాణదారుల సొంత పేర్లపై అగ్రిమెంట్ చేయించేందుకు చొరవ చూపినందుకు ఎమ్మెల్యే విజయరమణారావుకు దుకాణదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న తమకు అగ్రిమెంట్ ప్రక్రియ ద్వారా భద్రత కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా దుకాణదారులు ఎమ్మెల్యే విజయరమణారావును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బూతగడ్డ సంపత్‌తో పాటు దుకాణదారులు అభిలాష్, ఫారుక్, విష్ణు, ఆంజనేయులు, సుభాన్, ఓదెలు, వికాస్, రాజు, శేఖర్, కుమార్, ఉమేష్, సురేష్, చంద్రమౌళి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మికి 12 ఏళ్లు

- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- హాజరైన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : కళ్యాణలక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో మహిళలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమంలో పాల్గొని మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన కేసీఆర్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. వివాహ సమయంలో ఆర్థిక సాయం అందడంతో పేద కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, మహిళల గౌరవం, పేద కుటుంబాల ఆర్థిక భద్రత కోసం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాల ప్రాధాన్యతను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళలు, షేర్ మణమ్మ. బీఆర్ఎస్ నాయకులు, బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి. కే మహిపాల్ రెడ్డి. డప్పు గిరిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పట్టభద్రుల సమస్యలపై బీజేపీ పోరాటం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం: ఏనుగు సుదర్శన్‌రెడ్డి

**కుషాయిగూడ, మహా**: మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏనుగు సుదర్శన్‌రెడ్డి.. అనంతరం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్టభద్రుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీల అమలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. పట్టభద్రుల సమస్యలపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బండారు పవన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెట్టు మహేందర్‌రెడ్డి, పీర్జాదిగూడ డివిజన్ నాయకులు స్వరూప్‌చంద్ర, ఉజ్వల్, మేడిపల్లి డివిజన్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో గంజాయి కలకలం




**పెద్దపల్లి మహా:** పట్టణంలో గంజాయి పట్టుబడటం కలకలం రేపింది. ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెద్దపల్లి పట్టణంలో మరో వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సమాచారం ఆధారంగా తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి విక్రయించేందుకు తీసుకెళ్తున్నారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. పట్టణంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరించినా, ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల యువత ఆరోగ్యంతో పాటు వ్యక్తిగత జీవితం, కుటుంబ పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఎస్సై నరేష్ హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




## ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా**: జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి ల ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిధి గా ఉప్పల్ ఎమ్మెల్యే విచ్చేసి పలువురు జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్లను అందజేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయంతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి సంక్షేమం, భద్రత కు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమం లో గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,నేర్థం భాస్కర్ గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి,తిరుమలేష్,కొంపల్లి రవీందర్,పల్లె రాజకుమార్ గౌడ్,గడ్డం పాపి రెడ్డి,పిట్టల నరేష్,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్,ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుడిని గౌరవిస్తే సమాజం ఎదుగుతుంది

- విద్యార్థుల భవిష్యత్తును గురించి తపించేది ఉపాధ్యాయుడు..
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చేర్మెన్ టేకుల సుదర్శన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 4 మహా**: ఉపాధ్యాయుడిని గౌరవించే సమాజమే విద్యావంతమైన సమాజంగా ఎదుగుతుందని, టేకుల సుదర్శన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం జోనల్ స్థాయి ప్రవేట్ ఉత్తమ ఉపాధ్యాయుల ఆత్మీయ పురస్కారంలో పాల్గొన్న, మున్సిపాలిటీ చేర్మెన్ టేకుల సుదర్శన్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులను ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదేనని, విద్యార్థిని మంచి పౌరుడిగా, ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని ఆయన అన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ప్రతిరోజూ కష్టపడుతున్నారు. తమ వ్యక్తిగత సమస్యలను పక్కనపెట్టి పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు. కానీ వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భద్రత లభిస్తున్నాయా అనేది మనం ఆలోచించాల్సిన విషయం అని తెలిపారు. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు, సమాజ భవిష్యత్తును నిర్మించే శిల్పి అని కొనియాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు, సెలవులు, మెరుగైన పని వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు అభివృద్ధి చెందాలి.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి.. అదే సమయంలో ఆ అభివృద్ధికి పునాది అయిన ఉపాధ్యాయుల జీవితాలు కూడా బాగుండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కష్టాలను గుర్తించడం అంటే కేవలం వారి సమస్యలను వినడం మాత్రమే కాదు, వాటి పరిష్కారానికి ముందడుగు వేయడం అని అన్నారు.



## రాంపల్లిలో చెత్త కుప్పలు

- మూడు నెలలుగా తరలింపు నిలిపివేత
- మరో జవహర్‌నగర్‌గా మారే ప్రమాదం
- నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి

**కుషాయిగూడ, మహా**: గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా చెత్తను తరలించాల్సిన రాంకీ సంస్థ లిఫ్టింగ్‌ను నిలిపివేయడంతో పరిస్థితి దారుణంగా మారిందన్నారు. చెత్త సేకరిస్తున్న ఆటోలు స్థానికంగానే వ్యర్థాలను డంపింగ్ చేస్తుండటంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. చెత్త కుళ్లిపోవడంతో పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాంపల్లి పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో జవహర్‌నగర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను పూర్తిగా తరలించి, బ్లీచింగ్ తదితర పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాం చేశారు. సమస్యపై అధికారులు తక్షణమే స్పందించకపోతే స్థానికులతో కలిసి ఎంఎంసీ కార్యాలయం, ఘట్కేసర్ ప్రాంతంలో, ప్రధాన రహదారులపై పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని చంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.



## పుట్టినగడ్డ రుణం తీర్చుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నా

- హైదరాబాద్ కాలనీలను తలదన్నేలా మన మున్సిపాలిటీలు
- విద్య, వైద్యం అందరికీ అందుబాటులో ఉండేలా దృష్టి
- పేదలను, సెటిలర్స్‌ను ఇబ్బందిపెడితే సహించబోను
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఆదిభట్ల అక్టోబర్ 4 మహా**: పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నానని… ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి క్రతువులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూర్ డివిజన్ పరిధిలో కోటి 38లక్షల రూపాయలతో పూర్తి చేసిన పలుఅభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.10లక్షలతో శ్రీరంగంపురం కాలనీలో, రూ.20లక్షలతో బాలాజీనగర్‌లో, రూ.10క్షలతో తిరుమలనగర్ కాలనీలో, రూ.35లక్షలతో యాపిల్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే, తుర్కయంజాల్‌లో రూ.30లక్షలతో నిర్మించిన స్మశానవాటిక, రూ.20లక్షలతో కమ్యూనిటీహాల్, యాపిల్ ఎవెన్యూ కాలనీలో రూ.13లక్షలతో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో తుర్కయంజాల్, హయత్‌నగర్ ప్రాంతాలు ఆదర్శంగా నిలిచాయని మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. గత 14ఏళ్లలో అస్తవ్యస్థంగా మారిపోయాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గారు నిధుల కేటాయింపులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి అగ్రతాంబూలం వేస్తున్నారన్న ఎమ్మెల్యే…. హైదరాబాద్ కాలనీలను తలదన్నేలా ఇక్కడి మున్సిపాలిటీలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న ఎమ్మెల్యే… ఆరుట్ల టీపీఎస్, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. తొర్రూర్ సమీపంలోని మరో ప్రభుత్వాస్పత్రి నిర్మిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉండే వారిని ఎవరైనా ఇబ్బంది పెడితే సహించబోనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి హెచ్చరించారు. తాను తొర్రూర్‌లోనే అందుబాటులో ఉంటానని… ఎవరికి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి ఎస్సీ సివిల్ కాంట్రాక్టర్ల నూతన కమిటీ ఎన్నిక..

- కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే లక్ష్యం..

**మణుగూరు, మహా** : సింగరేణి సంస్థలో సివిల్ కాంట్రాక్టర్లుగా కొనసాగుతున్న ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఐక్యత లక్ష్యంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మణుగూరులో నిర్వహించిన సమావేశంలో పెద్ద సంఖ్యలో సివిల్ కాంట్రాక్టర్లు పాల్గొని తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న సమస్యలను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పనుల్లో సమాన అవకాశాలు కల్పించేలా కృషి చేయడం, కాంట్రాక్టర్ల హక్కుల కోసం సంఘటితంగా ముందుకు సాగడం తమ ప్రధాన లక్ష్యమని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంట్రాక్టర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని సివిల్ కాంట్రాక్టర్ల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాజ్‌వీర్, గౌరవ సలహాదారుగా మునిగెల రమేష్, అధ్యక్షుడిగా కటుకూరి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా ముసలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు సునీల్, కార్యదర్శిగా గోవింద శ్రీనివాస్, కోశాధికారిగా చింతమల్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సింగరేణిలో కాంట్రాక్టర్లకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు, సంఘం నాయకులు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పీఎల్ఆర్ బోనస్‌లో కార్మికులకు అన్యాయం

- జాతీయ సంఘాలు కార్మికుల శ్రమను తాకట్టు పెట్టాయి
- వాస్తవ లాభాల్లో 36 శాతానికి పైగా వాటా చెల్లించాలని
- టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి

**మణుగూరు, మహా** : ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రతికూల పరిస్థితుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ దేశానికి, రాష్ట్రానికి బొగ్గు అందిస్తున్న సింగరేణి కార్మికులకు తగిన ప్రతిఫలం సాధించడంలో జాతీయ కార్మిక సంఘాలు విఫలమయ్యాయని టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. కార్మికుల శ్రమను యాజమాన్యం వద్ద తాకట్టు పెట్టే విధంగా ఆయా సంఘాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆదివారం పికే ఓపెన్ కాస్ట్2ను సందర్శించిన ఆయన కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శనివారం కలకత్తాలో జరిగిన అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో నాలుగు కార్మిక సంఘాలు పాల్గొని రూ.1,10,250 లాభాల ఆధారిత బోనస్‌కు ఒప్పందం కుదుర్చుకోవడం కార్మికుల శ్రమకు తగిన విలువ సాధించలేకపోయిన దానికి నిదర్శనమన్నారు. గతంలో రూ.1.20 లక్షలకు పైగా బోనస్ సాధిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు రూ.1,10,250కు ఎందుకు అంగీకరించారో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాల బోనస్ పెరుగుదలను పరిశీలిస్తే 202223లో రూ.8,500, 202324లో రూ.8,700, 202425లో రూ.9,250 చొప్పున పెరుగుదల కనిపించిందని, 202526లో మాత్రం పెరుగుదలకు బదులుగా రూ.7,250 తగ్గుదల చోటుచేసుకుందని నాగెల్లి పేర్కొన్నారు. ఇది కార్మికుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమన్నారు. సింగరేణి సంస్థ 202526 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాల నుంచి కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లాభాల వాటా బోనస్‌పై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొందన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ నెల 5న అన్ని గనులు, విభాగాల్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు, 6న జనరల్ మేనేజర్లకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అప్పటికీ లాభాల వాటా బోనస్‌పై స్పష్టమైన ప్రకటన రాకపోతే కార్మికుల మద్దతుతో సింగరేణి భవన్ ముట్టడి సహా తదుపరి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొని టీబీజీకేఎస్‌కు అండగా నిలవాలని నాగెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్‌కుమార్, జంగం రాజ్‌కుమార్, సాంబార్ రాజశేఖర్, శ్రావణ్‌కుమార్, శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల టీపీఎస్ తరహాలో నియోజకవర్గంలో మరిన్ని బడులు

**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి...**

**ఆదిభట్ల అక్టోబర్ 4 మహా:** విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడి సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యావసతులు కల్పించే లక్ష్యంతో ఆదివారం ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.54లక్షలతో అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు. సర్కార్ బడులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోనే తొలి టీపీఎస్‌ను ఆరుట్లలో ఏర్పాటు చేశామని... అక్కడ 'నో అడ్మిషన్' బోర్డు పెట్టినట్లు చెప్పారు. ఈ తరహా విద్యాకేంద్రాలు మరిన్ని



ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ సత్తయ్య, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, కాకుమాను సునీల్, వంశీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములపై త్వరలో తీపి కబురు

- భద్రాద్రి సమగ్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తా
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు విస్తృతంగా కృషి చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: తరతరాలుగా పోడు కొట్టుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారికి పోడు భూముల సమస్యల పరిష్కారంపై త్వరలోనే తీపి కబురు చెబుతానని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగించారు. అటవీ భూములకు సంబంధించి కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని కేంద్రంతో సంప్రదించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం..**

గత తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో పేదలను పట్టించుకోలేదని గళ మెత్తిన నిరుద్యోగులను ఉరికించి కొట్టారని 33 నెలల మా ప్రజా ప్రభుత్వ పాలనలో రైతు రుణమాఫీ రైతు భరోసా క్వింటాకు రూ.500 బోనస్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉద్యోగులకు నోటిఫికేషన్లతో ప్రజా సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు ఇల్లిస్తే కమిషన్లు రావని లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి ఇష్టం వచ్చినట్లు దోచుకోగా వారు అధికారంలో ఉన్నప్పుడే అది కూలే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**అన్ని గ్రామాలకు నిధులిస్తా..**

ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని గ్రామాలకు నిధులను కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మూడు అవసరమైతే నాలుగో విడతలో కూడా మంజూరు చేస్తామని రాజకీయాలకు అతీతంగా పేదలకు కేటాయిస్తామని వెల్లడించారు. హైదరాబాదులోని పేదలు వారు పనిచేసే ప్రాంతాల్లోనే ఖరీదైన భూముల్లో అపార్ట్మెంట్లు కట్టించి ఇస్తున్నామని ఒక్కొక్కరికీ రూ.కోటి విలువ చేసే ఇల్లు దక్కుతోందని అన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి..**

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బృందాలుగా గ్రామ మండల స్థాయిలో విస్తృతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, సీనియర్ నాయకులు నాగా సీతారాములు, ఆళ్ల మురళి, గోపాలరావు, మండల అధ్యక్షులు ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# బీసీలకు టికెట్లు అడిగే హక్కు కూడా లేదా..?

- బీసీలు ప్రశ్నిస్తే దాడులా.
- హక్కుల కోసం మాట్లాడితే ఎందుకింత ఆగ్రహం?
- నిన్నటి దాడి ఘటనపై బీఆర్ఎస్ నాయకుడు గంట రాములు ఆగ్రహం



**పెద్దపల్లి మహా** : బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, బీసీలకు టికెట్లు ఇవ్వాలని ప్రశ్నిస్తే సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడతారా..? బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం మాట్లాడితే ఎందుకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ బీసీ నాయకులు ప్రశ్నించారు. బీసీల హక్కుల కోసం గొంతెత్తిన గంట రాములు, ఇతర నాయకులు వర్గం పై నిన్న జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ గంట రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు తీవ్రంగా స్పందించారు. బీసీలు తమ హక్కుల కోసం ప్రశ్నించడం తప్పా అని వారు ప్రశ్నించారు. రాజకీయంగా బీసీలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలని కోరడం, తమ వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అన్నారు. అలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. సందర్భంగా గంట రాములు మాట్లాడుతూ.. "బీసీలకు టికెట్లు అడిగే హక్కు కూడా లేదా? బీసీలు ప్రశ్నిస్తే దాడులా? మా వర్గాల నాయకులు తమ హక్కుల కోసం మాట్లాడితే ఎందుకింత ఆగ్రహం?" అని ప్రశ్నించారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం ప్రశ్నించడం తమ హక్కు అని, ఇందుకోసం పోరాడటం తమకు కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. రైతుల నీటి కోసం, రైతుల సమస్యల పరిష్కారం కోసం గతంలో పోరాటాలు చేసి జైలుకు వెళ్లిన చరిత్ర తనకు ఉందని గంట రాములు గుర్తుచేశారు. "ప్రజల కోసం పోరాడటం రాములుకు కొత్త కాదు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. దాడులు, బెదిరింపులతో మా గొంతును అణచివేయలేరు" అని పేర్కొన్నారు. నిన్న జరిగిన దాడి ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎంటీవో కార్యాలయంలో సీపీ ఆకస్మిక తనిఖీ

- పరిశుభ్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి ఆదేశం

**పెద్దపల్లి మహా** : రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని ఎంటీవో (మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశీలించిన నేపథ్యంలో నిర్వహణ తీరుపై అధికారులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంటీవో కార్యాలయ పరిసరాలతో పాటు పోలీస్ వాహనాల పార్కింగ్ ప్రాంతం, సిబ్బంది విశ్రాంతి బ్యారక్‌లను పరిశీలించిన కమిషనర్.. అన్ని ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బంది క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ శాఖకు చెందిన ప్రభుత్వ వాహనాల నిర్వహణ, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాహనాల కండిషన్, నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యాలయ నిర్వహణలో పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణ, సమర్థవంతమైన నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పరిశుభ్రమైన, క్రమబద్ధమైన పని వాతావరణం పోలీసు సేవల నాణ్యతను, సిబ్బంది సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని సీపీ పేర్కొన్నారు.



# బతుకమ్మ కానుకగా మహిళలకు చీరల పంపిణీ

**పెద్దపల్లి మహా :** రామగుండం : తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరలను ఆదివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక ఆదేశాల మేరకు 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీలోని మహిళలకు బతుకమ్మ చీరలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. పండుగ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న చీరలను అందుకోవడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ అత్యంత ప్రీతిపాత్రమైనదని అన్నారు. మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ కాలనీలోని పేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బతుకమ్మ పండుగ వేళ తమకు చీరలను అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్‌కు ఇందిరమ్మ కాలనీ మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# కరాటే సెలక్షన్స్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయరమణారావు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్‌లో పెద్దపల్లి జిల్లా స్థాయి అండర్ 11, అండర్ 14 బాలురు, బాలికల 70వ ఎస్‌జీఎఫ్ కరాటే సెలక్షన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, కరాటే పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే సెలక్షన్స్‌లో అండర్ 11, అండర్ 14 విభాగాల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# గంగారం క్రాస్‌రోడ్డుపై పూజలు.. స్థానికుల్లో ఆందోళన

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లాలోని కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం క్రాస్‌రోడ్డుపై రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కలకలం రేపాయి. రహదారిపై పూజా సామగ్రి కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. నిత్యం రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



# సామాన్యుడికి మళ్లీ ఈఎంఐల సెగ!

- పావు శాతం వడ్డీ రేటును పెంచనున్న ఆర్బీఐ.
- 5.50 శాతానికి చేరనున్న రెపో రేటు..

**ముంబై, మహా** : సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే వారితో పాటు, వాహన, ఇతర రుణాలు తీసుకున్న సామాన్యులపై మళ్లీ ఈఎంఐల భారం పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మరోసారి వడ్డీ రేట్ల పెంపునకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాల్లో వడ్డీ రేట్ల సవరణపై కీలక నిర్ణయం వెలువడనుంది. ప్రస్తుతమున్న 5.25 శాతం రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంచి 5.50 శాతానికి చేర్చే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకర్ల సర్వేలో వెల్లడైంది. ఏడో తేదీన ఎంపీసీ సమావేశాల ముగింపు అనంతరం ఆర్బీఐ గవర్నర్ ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. దేశీయంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు నానాటికీ పెరుగుతుండటం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పైకి ఎగబాకుతుండటం ఆర్బీఐ తాజా నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు సైతం వడ్డీ రేట్లను పెంచుతున్న నేపథ్యంలో ఆర్బీఐ కూడా అదే బాటలో పయనించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి 2023 ఫిబ్రవరిలో ఆర్బీఐ చివరిసారిగా రెపో రేటును పావు శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. ఆ తర్వాత ఆర్థిక పరిస్థితులు కాస్త కుదుటపడటంతో 2025 సంవత్సరం నుంచి దశలవారీగా వడ్డీ రేట్లను తగ్గిస్తూ రావడం వల్ల ప్రస్తుతం అది 5.25 శాతానికి దిగివచ్చింది. అయితే, ప్రస్తుత భౌగోళిక ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మళ్లీ వడ్డింపుల పర్వానికి ఆర్బీఐ తెరతీయనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే ప్రతికూలంగా కొనసాగితే డిసెంబర్‌లో జరిగే తదుపరి ఎంపీసీ సమావేశంలోనూ మరో 25 బేసిస్ పాయింట్ల మేర పెంపు ఉండొచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. మార్కెట్ వర్గాల అంచనాల మేరకు ఆర్బీఐ రెపో రేటును పావు శాతం పెంచితే మాత్రం ఆ ప్రభావం నేరుగా సామాన్యుల జేబులపై పడనుంది. ఆర్బీఐ నిర్ణయం వెలువడిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులు సైతం తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తాయి. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత ప్రియం కానున్నాయి. ఇప్పటికే ఫ్లోటింగ్ రేట్ల విధానంలో రుణాలు తీసుకుని ఈఎంఐలు చెల్లిస్తున్న వారి నెలవారీ వాయిదాల భారం అమాంతం పెరగనుంది. అలాగే కొత్తగా రుణాలు తీసుకోవాలనుకునే వారికి సైతం అధిక వడ్డీల సెగ తప్పదు. పండుగల సీజన్‌లో గృహ, వాహన విక్రయాలు ఊపందుకునే సమయంలో వడ్డీ రేట్లు పెరిగితే అది కొనుగోళ్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# 9న ఆర్టీసీ గుర్తింపు సంఘ ఎన్నికలు

- కంది శ్రీనివాస రెడ్డిని కలిసిన నాయకులు కార్మికులు
- కాంగ్రెస్ మద్దతిస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కంది శ్రీనివాస రెడ్డి పిలుపు
- బాణం గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి

ఆదిలాబాద్ మహా: టీఈజీఎస్ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్న టీడబ్ల్యూ యూ,ఎస్ డబ్ల్యూ ఎఫ్ ,ఐఎన్టీయూసీ మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు.ఆర్టీసీ నాయకులు ఆదివారం కంది శ్రీనివాస రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మద్దతు కోరారు. ఈ నెల 9న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న టీజీఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటేయాలని కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్న మిత్ర పక్షాల కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ కార్మికులకు కంది శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేసారు. క్లాస్III, క్లాస్VIకు సంబంధించిన రెండు ఓట్లను కూడా బాణం గుర్తుకే వేయాలని కోరారు. ఆర్టీసీకి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని, సంస్థను లాభాల బాట పట్టించేందుకు చర్యలు చేపట్టిందని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.అలాగే రేపు నిర్వహించే కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, మద్దతు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ , నాయకులు దేవిదాస్ చారి ఆర్టీసీ సంఘ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





# ఆదిలాబాద్ కాంగ్రెస్ లోకి వలసల జోరు

- బీజేపీ బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి



ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కం◌ి శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం భోరజ్ మండల కేంద్రం నుండి పొట్ట అశోక్, శైలేష్ రెడ్డి, రాజారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిమ్మల గజానన్ తోపాటు పలువురు బీజేపీ బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం లో జరిగిన చేరికల కార్యక్రమం లో కంది శ్రీనివాస రెడ్డి వారందరికి కండువాలు పార్టీ లోకి స్వాగతించారు. భోరజ్ మండల అభివృద్ధి కోసం నిత్యం కష్టపడే గజానన్ ఇతర నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. అందరూ సోషల్ మీడియాలోయాక్టివ్ గా ఉండాలన్నారు. గ్రామాలలో పార్టీ ని మరితం పటిష్ట పరిచేందుకు ఈ చేరికలు ఎంతో దోహదపడాతాయన్నారు పార్టీ శ్రేణులు ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు.అంతా కలిసి పార్టీ ని మరింగా బలోపేతం చేసుకుందామని వచ్చే ఎన్నికల నాటికి తిరుగలేని శక్తిగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు , భోరజ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# నిర్మల్ లో మంత్రుల పర్యటన

**ఆదిలాబాద్ మహా :** రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ,పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈనెల 5 న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం బేగంపేట ఎయిర్ పోర్ట్ నుండి బయలు దేరి ఉదయం 945 కు నిర్మల్ ఐడీవోసీ కి చేరుకుంటారు .ఉదయం 10 నుండి 330 వరకు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు భూమి పూజలు చేయనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటలకు గ్రీవెన్స్ కు హాజరవుతారు. రాత్రి అక్కడే బస చేసి మంగళవారం మంత్రి జూపల్లి ఆదిలాబాద్ జిల్లా లో పర్యటిస్తారు. ఉట్నూర్ మండలం మత్తడిగూడలో ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశం, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. గోండ్ రాజుల కోటను సందర్శించి, పర్యాటక అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత ఇంద్రవెల్లిలో మిస్ ఎర్త్ వాటర్ ఇండియా అవార్డు గ్రహీత విజేత ప్రీతి ముండేను సత్కరిస్తారు. అనంతరం రిమ్స్‌ను సందర్శించనున్నారు.



# బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**పలువురుకి ఆర్థిక సాయాలు**

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. ఆదివారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారు ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబాలను అలాగే ఆసుపత్రులలో అనారోగ్యంతో బాధ పడుతున్నవారిని కలసి పరామర్శిచారు. వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, శాంతన్ రావు , బండారి సతీష్, బోనగిరి సంటెన్న, తమ్మల చందు, విఠల్ రెడ్డి తదితరులున్నారు.







# సింగరేణి, కోల్ ఇండియా కార్మికులకు దీపావళి నజరానా

- 1,10,250 బోనస్ ప్రకటించిన యాజమాన్యం
- గతేడాది కంటే 7,250 రూపాయలు పెంపు



**మంచిర్యాల, మహా** : బొగ్గు పరిశ్రమ కార్మికులకు కోల్ ఇండియా యాజమాన్యం దీపావళి బోనస్ కానుక ప్రకటించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో కార్మికుడికి 1,10,250 రూపాయల పీఎల్ఆర్ (పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు) బోనస్ చెల్లించనున్నట్లు శనివారం రాత్రి ప్రకటించింది. కోల్ కతాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో చైర్మన్ బి. సాయిరాం అధ్యక్షతన జరిగిన జేబీసీసీఐ అపెక్స్ కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని ఉమ్మడిగా తీసుకున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 3 గంటల వరకు సాగింది. ఈ సమావేశంలో కార్మిక ట్రేడ్ యూనియన్లు బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు. యూనియన్లు ముందుగా 1.15 లక్షల రూపాయల నుంచి 1.20 లక్షల వరకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అయితే యాజమాన్యం మాత్రం లక్ష 8 వేల నుంచి 9,500 రూపాయల వరకే ఇస్తామని ప్రతిపాదించింది. చివరకు ఇరువర్గాల మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం 1,10,250 రూపాయలకు అంగీకారం కుదిరింది. దీనికి కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా ఓకే చెప్పారు.

**2.37 లక్షల మందికి లబ్ధి**

ఈ బోనస్ తో దేశవ్యాప్తంగా 2.37 లక్షల మంది నాన్ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఇందులో కోల్ ఇండియాలో 1.97 లక్షల మంది, మార్చి 2026 నాటికి సింగరేణిలో ఉన్న 40,300 మంది కార్మికులు ఉన్నారు. అలాగే ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 మధ్య రిటైర్ అయిన 8,351 మంది కోల్ ఇండియా ఉద్యోగులకు, 30 రోజులు పనిచేసిన ఉద్యోగులకు కూడా ఈ బోనస్ వర్తిస్తుంది. గతేడాది 1,03,000 రూపాయల బోనస్ ఇవ్వగా, ఈసారి 7,250 రూపాయలు అదనంగా పెంచారు. ఇది దాదాపు 7 శాతం పెంపు. 2021 22లో రూ.76,500గా ఉన్న బోనస్, 202425 నాటికి 1.03 లక్షలకు చేరింది. ఇప్పుడు 1.10 లక్షలు దాటడం కార్మికుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. సాధారణంగా కోల్ ఇండియా ఉద్యోగులకు దసరా పండుగ ముందు, సింగరేణి యాజమాన్యం దీపావళి ముందు బోనస్ చెల్లిస్తుంది. అక్టోబర్ 15లోపు చెల్లించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో యూనియన్ల నుంచి కె. లక్ష్మారెడ్డి (బీఎంఎస్), హర్భజన్ సింగ్ సిద్ధూ (హెచ్ఎంఎస్), డి.డి. రామానందన్ (సీఐటీయూ), లఖన్ లాల్ మహతో (ఏఐటీయూసీ), యాజమాన్యం తరపున మార్కెటింగ్ డైరెక్టర్, హెచ్ఆర్ డైరెక్టర్ ముకేశ్ చౌదరి, ఫైనాన్స్ డైరెక్టర్ ముకేశ్ అగర్వాల్, సింగరేణి డైరెక్టర్ (పా) గౌతం పొట్ల తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి సంఘ అధ్యక్షుడికి కంది శ్రీనివాస రెడ్డి ఆత్మీయ సత్కారం

**ఆదిలాబాద్ మహా :** ఇటీవల ఆదిలాబాద్ పట్టణం లో జరిగిన పద్మశాలి సంఘ ఎన్నికలలో గెలిచిన నూతన కార్యవర్గానికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అభినందనలు తెలిపారు.ఆదివారం పట్టణంలోని దస్నాపూర్ లో గల జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షులు జక్కుల సత్య నారాయణ నివాసాన్ని ఆయన సందర్శించారు. కంది శ్రీనివాస రెడ్డి కి ఆయన ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపి దంపతులను శాలువాతో సత్కరించారు. పద్మ శాలి సంఘ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారమందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, శాంతన్ రావు , బండారి సతీష్, బోనగిరి సంటెన్న, తమ్మల చందు, విఠల్ రెడ్డి, పద్మశాలి సంఘ నాయకులు మంచికట్ల ఆశమ్మ అల్చెట్టి నాగన్న, కుర్ర రవీందర్, అనుముల ఉషన్న, కొక్కుల అడెల్లు తదితరులు పాల్గొన్నారు





# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సదస్సు

- ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

వరంగల్, మహా ; వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాజశ్రీ గార్డెన్స్ లో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు పై సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 2024లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఎన్రోల్మెంట్ తో పాటు పోలింగ్ ప్రక్రియలో తన వెంట ఉండి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కూడా 2023 నవంబర్ నాటికి డిగ్రీ, ఇంజనీరింగ్ లేదా ఇతర అర్హత కలిగిన కోర్సులు పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఎన్రోల్మెంట్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అధికారిక ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని కార్యకర్తలకు సూచించారు. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న అర్హులైన పట్టభద్రులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నన్నపునేని నరేందర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త బాధ్యతతో ఎన్రోల్మెంట్ ప్రక్రియ పూర్తి చేయాలని, అలాగే ప్రతి డివిజన్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించడం జరిగిందని, ప్రతి 100 మంది పట్టభద్రులకు ఒక ఇన్‌చార్జిని కూడా కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రతి డివిజన్ లో ఎన్రోల్మెంట్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని అర్హులైన పట్టభద్రులు అధికారిక నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా డివిజన్లో హెల్ప్ డెస్క్ ద్వారా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త తన పరిధిలోని పట్టభద్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఏవైనా ఎన్రోల్మెంట్ లో ఎదురయ్యే సమస్యలను వెంటనే నియోజకవర్గ స్థాయి సమన్వయ బృందం దృష్టికి తీసుకురావాలని చివరి తేదీ వరకు వేచి ఉండకుండా మేము ఇచ్చిన ప్రాణాలిక ప్రకారం ముందుగానే ఎన్రోల్మెంట్ పూర్తి చేయాలని సూచిస్తూ ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ధృవీకరించుకున్న తర్వాతే షేర్ చేయాలని అవసరమైన చోట అదనపు కార్యకర్తలను, టీమ్‌లను ఏర్పాటు చేసి పని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, మహిళా నేతలు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తూడూరి శ్రీనివాస్ స్మారక స్థూపం ఆవిష్కరణ

**పెద్దపల్లి మహా** : అంతర్గాం మండల సీఐటీయూ మాజీ కన్వీనర్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు అమరుడు కామ్రేడ్ తూడూరి శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎక్లాస్పూర్ గ్రామంలో ఆయన స్మారక స్థూపాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రబవెల్లి ముత్యంరావు, గ్రామ సర్పంచ్ జూపాక మమత శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ సీపెల్లి రవీందర్ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, సర్పంచ్ జూపాక మమత శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాకేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు జూపాక శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, జిల్లా కోశాధికారి ఎం. రామాచారి, జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ సర్పంచ్ గుమ్మడి వెంకన్న తదితరులు ప్రసంగించారు. శ్రీనివాస్ కార్మిక, గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని వారు స్మరించుకున్నారు

# దళిత మహిళ మాధవిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- **నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి**
- **సంగిశెట్టి క్రిస్టఫర్ సామాజిక కార్యకర్త**



**భువనగిరి అక్టోబర్ 4 మహా న్యూస్** : చింతపల్లి మండలం పీ.కే. మల్లెపల్లి గ్రామంలో గ్రామ సభ సందర్భంగా దళిత మహిళ వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన దాడిని సామాజిక కార్యకర్త సంఘీశెట్టి క్రిస్టఫర్ తీవ్రంగా ఖండించారు. గ్రామ సభ సందర్భంగా గనిపల్లి మాధవిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటన అత్యంత ఆందోళనకరమని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా వెలుగులోకి వచ్చిందని, దళిత మహిళపై బహిరంగంగా దాడి చేయడం ప్రజాస్వామ్య సమాజంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. గ్రామ సభలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సి ఉండగా, ఒక మహిళను కులపరంగా అవమానించడం, అసభ్య పదజాలంతో దూషించడం, దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత మహిళకు తక్షణ రక్షణ కల్పించడంతో పాటు, ఆమెకు న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని క్రిస్టఫర్ కోరారు. దళితులు, గిరిజనులపై కుల వివక్షకు, దాడులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, మహిళా సంఘాలు విద్యార్థి మేధావి సంఘాలు సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ గొంతెత్తాలని క్రిస్టఫర్ పిలుపునిచ్చారు.



# ప్లాస్టిక్ స్క్రాప్ గోదాములో భారీ అగ్నిప్రమాదం

- **భారీగా ఎగసి పడిన మంటలు**
- **4 ఫైర్ ఇంజన్లతో మంటలార్పిన సిబ్బంది**
- **సుమారు రూ.50 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా**

వరంగల్, ఎనుమాముల మహా; గ్రేటర్ వరంగల్ నగరం లోని 14వ డివిజన్ ఎనుమాముల మార్కెట్ ఎదుట చంద్ర కిరణ్ కోల్డ్ స్టోరేజ్ సమీపంలోని ప్లాస్టిక్ స్క్రాప్ గోదాములో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గోదాములో మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 4 ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి తీవ్రంగా శ్రమించారు. అంతేకాకుండా స్థానిక పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఇంకా మరి ఏవైనా కారణాలు ఉన్నాయా అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో ఎన్టీఆర్ నగరవాసుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ అగ్ని ప్రమాదంలో ప్రాణ నష్టం జరగనప్పటికీ సుమారు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని సమాచారం.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- **జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె మనోహర్**
- **15 మంది వ్యాపారుల పై కేసులు నమోదు**



వరంగల్, నర్సంపేట మహా; తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ముద్రలు వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సందర్భంగా తూకాలను పరిశీలంచాలని సూచించారు. ముఖ్యంగా జిల్లా అంతటా లీగల్ మెట్రోలజీ అధికారి, సిబ్బంది పర్యవేక్షణ ఇలాగే కొనసాగిస్తే కొలతలు, తూనికల్లో మోసాలు జరగకుండా ప్రజలకు సరైన తూకంతో సరుకులు అందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.

# సింగరేణి సంస్థకు చెల్లించవలసిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- **...సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మిట్టపల్లి వెంకటస్వామి & బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్**




**బెల్లంపల్లి, మహా**: సింగరేణి సింగరేణి సంస్థకు ప్రభుత్వ అనుబంధం లోని సంస్థల నుండి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా సారించాలనిసింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మిట్టపల్లి వెంకటస్వామి,బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ లు సంయుక్తంగా డిమాండ్ చేశారు. ఆదివారం రోజున సిపిఐ కార్యాలయం బెల్లంపల్లి యందు సింగరేణి లో జరుగుతున్న అనేక అంశాలపై వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40% లాభాల వాటా చెల్లించడంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ జెన్కో తెలంగాణ ట్రాన్స్కో,ల నుండి సంస్థకు రావాల్సిన సుమారు రూ.59,000 కోట్ల బకాయిలను తక్షణమే సింగరేణి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా సంస్థ లాభాల్లో వాటా ప్రకటించి చెల్లించడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. అయితే, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం పట్ల కార్మికవర్గంలో తీవ్ర ఆందోళన నెలకొందనీ,సింగరేణి సంస్థ అభివృద్ధిలో, బొగ్గు ఉత్పత్తి సాధనలో, సంస్థకు లాభాలు ఆర్జించి పెట్టడంలో కార్మికుల శ్రమ, అంకిత భావం ఎంతో కీలకమైనవి. కార్మికులకృషి ఫలితంగా సంస్థకు లాభాలు వచ్చినప్పుడు, ఆ లాభాల్లో కార్మికులకు తగిన వాటా కల్ విధానం అని ప్రశ్నించినప్పుడు. గత సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి, గౌరవ ముఖ్యమంత్రి గారి సమక్షంలో కార్మికులకు 40 శాతం లాభాల వాటాను ప్రకటించి చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేస్తున్నదనీ, సింగరేణి సంస్థలో ఎన్నడూ లేనివిధంగా ఉత్పత్తికి, కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత ఏర్పడుతున్నట్లు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరమైన మెటీరియల్ కొనుగోలుకు నిధులు లేవని యాజమాన్యం పేర్కొంటున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందనీ,బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంతో పాటు, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి అవసరమైన పరికరాలు, మెటీరియల్‌ను సమకూర్చడం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారుఇదే పరిస్థితి కొనసాగితే, అక్టోబర్, నవంబర్ నెలల్లో కార్మికులకు చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్, పి.ఎల్.ఆర్.ఎస్. (PLRS) వంటి ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి, సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు నుండి ( సుమారు రూ.59,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు పేర్కొనబడుతున్నదనీ,ఈ భారీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇప్పించేలా చర్యలు తీసుకుంటే, సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి, ఉత్పత్తి మరియు రక్షణకు అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చడానికి, కార్మికులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి సంస్థ వాస్తవ వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చలు జరిపి, గౌరవ ముఖ్యమంత్రి గారి సమక్షంలో కార్మికులకు 40 శాతం లాభాల వాటాను ప్రకటించి, దసరా సందర్భంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని,సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.59,000 కోట్ల బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తక్షణమే ఇప్పించేందుకు యాజమాన్యం ఉన్నతస్థాయిలో చొరవ తీసుకోవాలని,బొగ్గు ఉత్పత్తికి, కార్మికుల ప్రాణరక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరతను వెంటనే పరిష్కరించి, నిధుల కొరత పేరుతో ఉత్పత్తి మరియు రక్షణ చర్యలకు ఆటంకం కలగకుండా చూడాలని, పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్, పి.ఎల్.ఆర్.ఎస్. (PLRS) తదితర కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను నిర్ణీత సమయంలో చెల్లించేందుకు అవసరమైన నిధులను సమకూర్చాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మంతెన రమేష్, బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్, ఫిట్ కార్యదర్శి కాసిపేట 1 ఇంక్లైన్ వడ్లమల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- **ప్రజాస్వామ్య పరిరక్షణకు అఖిలపక్షాలు ఐక్యతతో ఉద్యమించాలి**
- **డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**



**వరంగల్ మహా** : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని ఏ1 ఫంక్షన్ హాల్ లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హాజరై, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.. అఖిలపక్షాల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీ పై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఉదయం 10 00 గంటలకు వరంగల్ పోచమ్మ మైదాన్ చౌరస్తా నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ చౌరస్తా వరకు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు అయూబ్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థ పై ప్రజలకు విశ్వాసం కల్పించేలా పారదర్శకమైన విధానాలు ఉండాలని, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత ను కాపాడాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, బీజేపీ పాలనలో ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అయూబ్ తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం అఖిల పక్షాలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన వరంగల్ పోచమ్మ మైదన్ నుండి హన్మకొండ అంబేద్కర్ వరకు అఖిలపక్ష ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకునే ప్రభుత్వాలే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రతినిధులని అన్నారు. అలాంటి పవిత్రమైన ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలు, పారదర్శకత పై ప్రశ్నలు తలెత్తినా వాటిని ఎన్నికల సంఘం అత్యంత బాధ్యతగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థపైనే ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి రావడం బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలు, ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని, రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు అనేది ప్రతి భారతీయుడి రాజ్యాంగ హక్కు. ఆ ఓటును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత. ప్రజల ఓటు హక్కుపై అనుమానాలు కలిగించే పరిస్థితులు ఏర్పడితే వాటిని నివృత్తి చేయాల్సిందే. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు అని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, నిరసనలు చేపడతామని తెలిపారు. ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దెబ్బతీసే కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని పార్టీలు ఐక్యంగా ముందుకు సాగాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా పారదర్శకత, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత ను కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరా కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరవి పరమేష్, సీపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బస్మియా, సీపీఐ నాయకురాలు రత్నమాల, జిల్లా జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఫైజుల్లా, టీడీపీ జిల్లా నాయకులు రఘు, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జిల్లా నాయకులు హకీమ్ నవీద్,తో పాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల సమస్యలపై ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆరా!

- **మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్**

**పెద్దపల్లి మహా** : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ, బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమరయ్య అన్నారు. ఆదివారం పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పాఠ్యపుస్తకాలు, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయం, వసతి గదులు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇతర మౌలిక వసతులపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఆయన.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అవసరాలు, పాఠశాలలో ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు. గురుకుల పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచేలా పరిశుభ్రమైన, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడుతామని స్పష్టం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవి పరిష్కారమయ్యే వరకు నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని మల్క కొమరయ్య తెలిపారు. గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, తగిన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## దివంగత నేత కాకా వెంకటస్వామి జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

**బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి ,మహా** : జాతీయ స్థాయిలో పదవులకు వన్నె తెచ్చిన స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను సోమవారం నాడు నిర్వహిస్తున్నందున కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రతినిధి, అట్టడుగు పేదల పెన్నిధి, జాతీయ స్థాయిలో పదవులకు వన్నెతెచ్చిన తెలంగాణ ముద్దుబిడ్డ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి ( కాకా ) 97వ జయంతిని పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి పట్టణ ఏఎంసి చౌరస్తాలో కాకా విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించడం జరుగుతుందనీ అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జయంతి వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్లు,గౌరవ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, డిసిసి నాయకులు, పట్టణ కమిటీ నాయకులు, బీసీ సెల్, ఎస్సీ సెల్, మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు 34 వార్డుల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,పార్టీ శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



## అమ్మ ఒడి – అన్నదాత ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

**బెల్లంపల్లిలో 404వ వారపు అన్నదాన కార్యక్రమం**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా-పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో, అమ్మ ఒడి స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదాత ప్రాజెక్ట్ మరియు టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంను ఆదివారం నాడు నిర్వహించారు.గుప్త దాత సహకారంతో యాచకులు, నిరుపేదలు, దినసరి కూలీలు, బాటసారులు సుమారు 200 మందికి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, బ్రాంచ్ మేనేజర్ & టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ... "ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం ఎంతో సంతృప్తినిచ్చే సేవ" అని అన్నారు.కార్యక్రమంలో హనుమాండ్ల సువర్ణ, గన్నేవరం తిరుమల చారి, చెందుపట్ల లింగమూర్తి, యూసుఫ్, భరత్ రుషి, కేశబోయిన రఘు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించిన వి.పి గౌతమ్, ఐఏఎస్

**వరంగల్, రంగంపేట మహా ;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఆదివారం సాయంకాలం తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వి.పి గౌతమ్, ఐఏఎస్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన గౌతమ్ కు అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించి ప్రసాదాలు కూడా అందజేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

# రణబలి టికెట్ ధరలపై క్లారిటీ

హైదరాబాద్, మహా: విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం తెరకెక్కుతున్న 'రణబలి' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దస కానుకగా అక్టోబర్ 16న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ తున్నారు. ఈ నేపథ్యంలో సినిమా టికెట్ ధరల పెంపుపై సోషల్ మీడియాలో జరుగుతు బృందం తాజాగా తెరదించింది. ఆంధ్రప్రదేశ్‌లో 'రణబలి' టికెట్ ధరలను పెంచేంద త్వ అనుమతి కోరినట్లు ఇటీవల వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా టికెట్ ధర వరకు పెంపు ఉండొచ్చనే ప్రచారం ప్రేక్షకుల్లో ఆసక్తితో పాటు ఆందోళనకు కార వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని చిత్ర నిర్మాతలు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పా టికెట్ ధరల పెంపు కోసం తాము ఎలాంటి దరఖాస్తు చేయలేదని అధికారికంగా వెల్ల సాధారణ టికెట్ ధరలతోనే థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ ప్రకటించారు. పండుగ కుటుంబ సమేతంగా సినిమాను ఆస్వాదించేలా టికెట్ ధరలు అందుబాటులో ఉం కున్నట్లు తెలిపారు. దీంతో టికెట్ ధరల పెంపుపై వచ్చిన ఊహాగానాలకు పూర్తిగా తె దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ పీరియాడిక్ ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీవాలా' విజ కోవడంతో 'రణబలి'పై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా విడుదల తేదీపై కూడా రూమర్లు వచ్చినప్పటికీ, అక్టోబర్ 16నే చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చే ధరల విషయంలో తాజా ప్రకటన రావడంతో విజయ్ దేవరకొండ అభిమానుల్లో ఉత్సాహం పండుగ సీజన్‌లో సాధారణ ధరలకే సినిమా అందుబాటులోకి రానుండటంతో ప్రేక్షకులకు ఇది ఊర అంశంగా మారింది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రమోషన్ కార్యక్రమాలు కు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.



# ఆమ్నా షరీఫ్ గ్లామరస్ ఫొటోషూట్

ముంబై, మహా: బాలీవుడ్ నటి, టెలివిజన్ నటి ఆమ్నా షరీఫ్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. తాజాగా నిర్వహించిన ఫొటోషూట్‌లో ఆమె విభిన్నమైన ఫ్యాషన్ లుక్‌లో కనిపించి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. ప్రత్యేకమైన దుస్తులు, ఆకట్టుకునే ఆభరణాలు, సహజమైన హావభావాలతో కెమెరా ముందు ఆమ్నా ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.తాజా ఫొటోషూట్‌లో ఆమ్నా షరీఫ్ టాప్ షోల్డర్ డిజైన్‌తో కూడిన టౌప్ రంగు బాడీకాన్ డ్రెస్‌లో కనిపించారు. దుస్తులపై ఉన్న రుచ్డ్ డిజైన్, హై స్లిట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోల్డ్ శాటిన్ బ్యాక్‌డ్రాప్ ముందు నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో ఆమె వేవీ హెయిర్‌స్టైల్‌తో పాటు స్టేట్‌మెంట్ ఇయర్‌రింగ్స్, గోల్డ్ వాచ్, బ్రేస్‌లెట్స్ వంటి యాక్సెసరీస్‌తో మరింత స్టైలిష్‌గా కనిపించారు. ఆమ్నా షరీఫ్ మోడల్‌గా, మ్యూజిక్ వీడియో ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2003లో 'కహీన్ తో హోగా' సీరియల్‌లో కషిష్ పాత్రతో టెలివిజన్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఈ పాత్ర ఆమెకు మంచి గుర్తింపును తీసుకురావడంతో పాటు టీవీ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించిపెట్టింది.ఆ తర్వాత సినిమాల్లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 'ఆలో చాట్', 'ఆవో విష్ కరేన్', 'షకల్ పే మత్ జావో' వంటి చిత్రాల్లో నటించారు. 'ఏక్ విలన్' చిత్రంతోనూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. టెలివిజన్‌లో 'హోంగే జుడా నా హమ్', 'కసౌటీ జిందగీ కే 2' వంటి సీరియల్స్‌లో విభిన్న పాత్రలు పోషించారు. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న కొమోలికా పాత్ర ఆమె నటనలో మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. తర్వాత ఓటీటీ వేదికపైనా ఆమ్నా షరీఫ్ తన ప్రయాణాన్ని కొనసాగించారు. 'డ్యామేజ్డ్ 3', 'ఆధా ఇష్క్' వంటి డిజిటల్ ప్రాజెక్టుల్లో కనిపించారు. నటనతో పాటు ఫ్యాషన్, ఫొటోషూట్లు, బ్రాండ్ ప్రమోషన్స్ ద్వారా కూడా అభిమానులతో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. తాజాగా విడుదలైన ఫొటోషూట్‌లో ఆమె చూపించిన గ్లామర్, ఎలిగెన్స్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది.





# రెడ్ టాప్‌లో అమైరా దస్తూర్ మెరుపులు

ముంబై, మహా: అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అమైరా దస్తూర్ మరోసారి తన ఫ్యాషన్ స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. ఎరుపు రంగు స్లీవ్‌లెస్ టాప్, బ్లాక్ అండ్ వైట్ జీబ్రా ప్రింట్ స్కర్ట్‌లో అమైరా స్టైలిష్‌గా కనిపించారు. బొటిక్‌లో నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో అమైరా తనదైన స్టైల్‌తో పోజులిచ్చారు. తలకు సన్‌గ్లాసెస్ పెట్టుకుని, బ్లాక్ హీల్స్, గోల్డ్ కఫ్ బ్రేస్‌లెట్‌తో ఆమె లుక్‌ను పూర్తి చేశారు. సాధారణంగా కనిపించే రెడ్, బ్లాక్, వైట్ రంగుల కాంబినేషన్‌కు తనదైన గ్లామర్ టచ్ జోడించారు. ముఖ్యంగా జీబ్రా ప్రింట్ స్కర్ట్ ఈ ఫొటోషూట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమైరా దస్తూర్ 2013లో 'ఇస్సాక్' సినిమాతో నటిగా వెండితెరకు పరిచయమయ్యారు. అనంతరం తమిళ చిత్ర పరిశ్రమలో ధనుష్‌తో కలిసి 'అనేగన్' సినిమాలో నటించారు. తెలుగులోనూ 'మనకు వచ్చాడు' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయమయ్యారు. హిందీ సినిమాలతో పాటు దక్షిణాది చిత్రాలు, ఓటీటీ ప్రాజెక్టుల్లోనూ ఆమె తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. జాకీ చాన్‌తో కలిసి 'కుంగ్ ఫూ యోగా'లో నటించడం ద్వారా అమైరాకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది. 'మిస్టర్ ఎక్స్', 'జడ్జ్‌మెంటల్ హై క్యా', 'ప్రస్థానం', 'కోయి జానే నా' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె కనిపించారు. 'తాండవ్', 'బాంబే మేరీ జాన్' వంటి డిజిటల్ సిరీస్‌ల లోనూ నటించారు.ప్రస్తుతం ప్రాంతీయ సినిమాలతో పాటు ఓటీటీ, ఫ్యాషన్ రంగాల్లోనూ అమైరా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తాజా ఫొటోషూట్‌లో ఆమె చూపించిన ఆధునిక ఫ్యాషన్ లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఎప్పటికప్పుడు విభిన్నమైన స్టైలింగ్‌తో కనిపించే అమైరా మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు.



# భార్య కోసం మనోజ్ ప్రత్యేక అడుగు

హైదరాబాద్, మహా: టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన భార్య భూమా మౌనిక పుట్టినరోజు సందర్భంగా చేసిన ఓ ప్రత్యేకమైన కార్యక్రమం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సెలబ్రిటీల పుట్టినరోజులు వేడుకలు, పార్టీలు, ఫొటోషూట్లతో సందడిగా సాగుతుంటాయి. అయితే మౌనిక పుట్టినరోజును మాత్రం మనోజ్ సామాజిక సేవతో ముడిపెట్టి జరపడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా భార్యపై తనకున్న ప్రేమ, గౌరవాన్ని వ్యక్తం చేస్తూ ఆయన సోషల్ మీడియాలో భావోద్వేగపూరితమైన సందేశాన్ని పంచుకున్నారు.జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్ల సమయంలో మౌనిక తనకు అండగా నిలిచారని మనోజ్ పేర్కొన్నారు. కష్టకాలంలో ధైర్యం చెప్పడంతో పాటు కుటుంబానికి తోడుగా నిలిచిన ఆమెను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భార్యగా, కుటుంబ సభ్యురాలిగా ఆమె అందిస్తున్న సహకారం తనకు ఎంతో విలువైనదని తన సందేశం ద్వారా తెలియజేశారు. మౌనిక తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన వ్యక్తి అని మనోజ్ పేర్కొన్నట్లు సమాచారం. మౌనిక సామాజిక సేవా కార్యక్రమాలపై కూడా మనోజ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'నమస్తే వరల్డ్', 'AIKYA ధైర్య సేన సమితి' వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవ చేయాలనే ఆమె ఆలోచనను ప్రశంసించారు. మౌనిక పుట్టినరోజును పురస్కరించుకుని 'AIKYA' సంస్థను ప్రారంభించినట్లు వెల్లడించారు. సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన భార్య ఆశయాలకు కుటుంబం మొత్తం అండగా ఉంటుందని మనోజ్ స్పష్టం చేశారు. ఆమె కలలు, సామాజిక సేవా లక్ష్యాలు మరింత ముందుకు సాగేందుకు తాము సహకరిస్తామని తెలిపారు. వ్యక్తిగత జీవితంలోని అనుబంధాన్ని సామాజిక బాధ్యతతో కలిపిన ఈ సందర్భంగా మంచు మనోజ్ చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సెలబ్రిటీ జీవితానికి భిన్నంగా సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించడం అభినందనీయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 'ఆదర్శ కుటుంబం'పై ఎందుకింత సైలెన్స్?

హైదరాబాద్, మహా: విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం-హౌస్ నెం.47'పై సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే విడుదలకు కొద్ది రోజులే సమయం ఉన్నప్పటికీ సినిమాకు ఆశించిన స్థాయిలో ప్రచారం కనిపించకపోవడం ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చకు దారితీస్తోంది. అక్టోబర్ 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వెంకటేష్‌కు ఉన్న ఫ్యామిలీ ఆడియన్స్ క్రేజ్, త్రివిక్రమ్‌కు ఉన్న మాటల మాంత్రికుడి ఇమేజ్‌తో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కాంబినేషన్ అనగానే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' తరహా కుటుంబ వినోదాన్ని అభిమానులు ఊహించుకుంటున్నారు. అయితే ఇప్పటివరకు విడుదలైన ప్రచార కంటెంట్ పరిమితంగానే ఉండటంతో సినిమా బజ్‌పై చర్చ మొదలైంది. సాధారణంగా స్టార్ హీరో సినిమా విడుదలకు వారం రోజుల ముందు నుంచే ట్రైలర్, ఇంటర్వ్యూలు, ప్రెస్‌మీట్లు, పాటలు, సోషల్ మీడియా ప్రచారంతో సందడి పెరుగుతుంది. కానీ 'ఆదర్శ కుటుంబం' విషయంలో ప్రచార కార్యక్రమాలు కొంత నెమ్మదిగా సాగుతున్నాయి. నిర్మాత సూర్యదేవర నాగవంశీ కూడా ప్రమోషన్స్ విషయంలో పెద్దగా హడావుడి చేయకపోవడం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదిలా ఉండగా, సినిమాకు సంబంధించిన కథపై సోషల్ మీడియాలో పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళ చిత్రం 'బ్లాస్ట్'తో పోలికలు ఉన్నాయంటూ గతంలో ప్రచారం జరిగింది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారికంగా ఎలాంటి ధృవీకరణ రాలేదు. దర్శకుడు త్రివిక్రమ్ ఇటీవల 'బ్లాక్ స్వాన్' అనే కాన్సెప్ట్ గురించి మాట్లాడటం వల్ల ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. మరోవైపు అక్టోబర్ 6న ట్రైలర్ విడుదల చేసి, అక్టోబర్ 7 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించనున్నట్లు నిర్మాత నాగవంశీ ఇప్పటికే స్పష్టం చేశారు. సినిమా అక్టోబర్ 9న విడుదల కావడం ఖాయమని కూడా ఆయన వెల్లడించారు. దీంతో విడుదల తేదీపై నెలకొన్న అనుమానాలకు తెరపడింది. వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై తుది అంచనాలు ట్రైలర్ తర్వాత మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. తక్కువ ప్రచారంతో థియేటర్లలోకి వస్తున్న 'ఆదర్శ కుటుంబం' ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో అక్టోబర్ 9న తేలనుంది.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com